RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 64 విశాఖపట్నం సంపాదకులు : కె.ఎస్.రంగశాయి శుక్రవారం17-04-2026 పేజీలు :8 వెల : రూ.1-00



## మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు
- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
-వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత-చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
-ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
-ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
-దీనిని విస్మరించే వారిని మహిళలలు క్షమించరు
-ఉత్తరాది, దక్షిణ్యాది అంటూ విభజన తేవద్దు
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీ మణులను నమ్మండి అని,

తరువాయి 2లో..

## దేశ రాజధానిలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ఈ నెల 30 నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహణ
- ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఢిల్లీ ఎల్ఏసీ ఛైర్మన్ వై.సుమంత్‌రెడ్డి



**నెల్లూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** దేశ రాజధాని దిల్లీలో ఈ నెలాఖరులో ప్రారంభ మయ్యే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్ర బాబును తితిదే దిల్లీ ఎల్ఏసీ ఛైర్మన్ వై.సుమంత్‌రెడ్డి ఆహ్వానించారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో భాజపా అధ్యక్షుడు మాధవ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌లతో కలిసి ముఖ్యమంత్రికి ఆహ్వానం అందించారు. ఈ నెల 30 నుంచి మే 10వ తేదీ వరకు దిల్లీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవ స్థానంలో బ్రహ్మో త్సవాలు జరుగుతాయని వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్స వాలను అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహిం చాలని సూచిం చారు. ఆహ్వానంపై సాను కూలంగా స్పందించినట్లు సుమంత్‌రెడ్డి తెలిపారు.

## మహిళా రిజర్వేషన్లకు జనసేన కట్టుబడి ఉంది

### డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



**అమరావతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టసవరణ బిల్లులు పార్లమెంట్ ముందుకు రావడాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతించారు. మహిళా రిజర్వేషన్లకు జనసేన కట్టుబడి ఉందన్నారు. 2019 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్ట మైన హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఈ సవరణతో చట్టసభల్లో మహిళలకు సరైన ప్రాతి నిధ్యం లభిస్తుందన్నారు. సమర్థులైన మహిళలు దృఢమైన కుటుంబాలను తయారు చేస్తారని, దృఢమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయని పవన్ వ్యాఖ్యా నించారు. మహిళల భాగస్వామ్యంతోనే దేశం సాధికారత వైపు పయనిస్తుందన్నారు. ఇలాంటి శుభ సందర్భంలో మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించిన తొలి భారతీయు రాలిగా ఆర్. వైశాలి చరిత్ర

తరువాయి 2లో..

## హైకోర్టులో బార్, బెంచ్‌ల మధ్య సత్సంబంధాలు



**అమరావతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీ హెచ్‌సీఏఏ) వార్షిక, సాంస్కృతిక వేడుకలను బుధవారం మంగళ గిరి- అత్మకూరు సీకే కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

తరువాయి 2లో..

## తీర ప్రాంత భద్రతకు సాగర్ డిఫెన్స్ అవసరం

- దానిని కూడా రాజకీయం చేయడం జగన్‌కే చెల్లింది - జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు

వార్త.. 2 లో

## సింహాచలం అప్పన్న చందనోత్సవం టికెట్ల విక్రయంపై ముఖ్య సూచనలు

**సింహాచలం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :**
శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక చందనోత్సవం సందర్భంగా, టికెట్ల విక్రయానికి సంబంధించి దేవస్థానం ముఖ్య ప్రకటన విడుదల చేసింది. ఏప్రిల్ 17 (శుక్రవారం) నుండి బ్యాంకులలో టికెట్ల విక్రయం పూర్తిగా నిలిపివేయబడుతుంది.

భక్తులు ఈ విషయాన్ని గమనించగలరు.

17వ తేదీ శుక్రవారం ఒక్కరోజు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా "మన మిత్ర" వాట్సాప్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి. టికెట్ల విక్రయం ఉదయం 8:00 గంటల నుండి ప్రారంభమవుతుంది.

**టికెట్ల వివరాలు:**

**"మన మిత్ర" ద్వారా**

**రూ.1000/- టికెట్లు - 460 రూ.300/-టికెట్లు 750**

**ఆన్‌లైన్ ద్వారా :**

**రూ. 1000/- టికెట్లు - 2215**

**రూ. 300/- టికెట్లు 3370**

**ఇవి కూడా ఏప్రిల్ 17 ఉదయం 8 గంటల నుండి అందుబాటులో ఉంటాయి.**

**అధికారిక వెబ్‌సైట్:**

**భక్తులు టికెట్లను క్రింది అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు:** https://chandanotsavam.ap.gov.in

మరియుగవర్నమెంట్ అధికారిక వాట్సాప్ నెంబర్ 9552300009 మనమిత్ర ద్వారా బుక్ చేసుకోవచ్చు

**భక్తులకు విజ్ఞప్తి:**

చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా, అందుబాటులో ఉన్న కోటా మేరకు టికెట్లను ముందుగానే బుక్ చేసుకుని, స్వామివారి నిజరూప దర్శనంను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని దేవస్థానం కోరుతోంది.

गृह मंत्रालय भारत सरकार

## మన జనగణన - మన అభివృద్ధి

(జనగణన 2027 మొదటి దశ)
స్వీయ లెక్కింపు (SE) పై సాధారణ ప్రశ్నలు మరియు సమాధానాలు (భాగం-1)

### స్వీయ లెక్కింపు అంటే ఏమిటి?

స్వీయ లెక్కింపు అనేది ఒక ఆన్‌లైన్ ప్రక్రియ. ఇందులో మీరు మీ కుటుంబ వివరాలను SE పోర్టల్ (se.census.gov.in)లో మీరే నమోదు చేసి సమర్పిస్తారు, ఎన్యూమరేటర్ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదు.



- స్వీయ లెక్కింపు తప్పని సరా?
  కాదు, ఇది ఒక అదనపు సౌకర్యం మాత్రమే. మీరు చేయకపోతే, ఎన్యూమరేటర్ మీ ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారు.
- ఏ భాషలో అయినా స్వీయ లెక్కింపు చేయవచ్చా?
  ఈ సౌకర్యం హిందీ, ఇంగ్లీష్ మరియు 14 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది.
- స్వీయ లెక్కింపుకు ఇంటర్నెట్ అవసరమా?
  అవును, పోర్టల్ ఉపయోగించడానికి ఇంటర్నెట్ అవసరం.
- నా సమాచారం సురక్షితమా?
  అవును, మీ సమాచారం మొత్తం సురక్షితంగా, ఎన్‌క్రిప్ట్ చేసి ప్రభుత్వ సర్వర్లలో నిల్వ చేస్తారు.
- SE ID అంటే ఏమిటి? దాని ఉపయోగం ఏమిటి?
  మీరు వివరాలు సమర్పించిన తర్వాత, మీకు ఒక ప్రత్యేకమైన 11 అంకెల SE ID వస్తుంది (SMS / Email ద్వారా కూడా వస్తుంది). ఈ ID ని ఎన్యూమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు చూపాలి.
- SE ID మర్చిపోతే ఏమి చేయాలి?
  మీ రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్ ద్వారా పోర్టల్‌లో తిరిగి పొందవచ్చు.
- స్వీయ లెక్కింపు తర్వాత ఎన్యూమరేటర్ వస్తారా?
  అవును, ఎన్యూమరేటర్ మీ ఇంటికి వచ్చి SE ID ద్వారా మీ వివరాలు ధృవీకరిస్తారు.
- ఏమైనా పత్రాలు అప్లోడ్ చేయాలా?
  లేదు, ఏ పత్రాలు అప్లోడ్ చేయాల్సిన అవసరం లేదు.
- పోర్టల్‌లో సహాయం ఉందా?
  అవును, యూజర్ గైడ్, ఫ్లోచార్ట్స్, ట్యుటోరియల్ వీడియోలు, FAQS మరియు టూల్ టిప్స్ అందుబాటులో ఉంటాయి.

టోల్ ఫ్రీ - 1855

CBC 19108/13/0018/2627

మన బాధ్యతను నెరవేర్చుకుందాం, జనగణనలో పాల్గొనండి CensusIndia2027

మొదటిపేజీ తరువాయి...

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడు తుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు. మహిళా రిజర్వేషన్ పక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రాక్రి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ధి ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటా రన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలాను గుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్త వానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదిం చాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావ కాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగ స్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పు కొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజు వైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరి గింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు.

## మహిళా రిజర్వేషన్లకు జనసేన కట్టుబడి ఉంది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

సృష్టించారని పవన్ అన్నారు. ఫిడే మహిళల టోర్న మెంట్‌లో విజేతగా నిలవడంపై అభినందనలు తెలిపారు.

## హైకోర్టులో బార్, బెంచ్‌ల మధ్య సత్సంబంధాలు

హైకోర్టులో బార్, బెంచ్ మధ్య సత్సంబం ధాలున్నాయని గుర్తుచేశారు. హైకోర్టు న్యాయ వాదుల సంఘానికి అధ్యక్షులుగా గతంలో పని చేసిన వారు చక్కగా బాధ్యతలు నిర్వర్తించారని, కొత్త అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రభునాథ్ సైతం మంచి సంబంధాలు కొన సాగించాలని ఆకాంక్షించారు. తాను ఈ నెల 24న పదవీ విరమణ చేస్తున్నట్లు సీజే తెలిపారు. యువ న్యాయ వాదులు కేసు గురించి శ్రద్ధగా చదవాలని, న్యాయం గెలిచేలా పోరా డాలని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్ – (ఏఎస్‌జీ) చల్లా ధనుంజయ, అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాల పాటి శ్రీనివాస్, ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకనాథ్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) ఎం.లక్ష్మీనారాయణ, ఏపీహెచ్‌సీఏఏ పూర్వ అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సుబోధ్, తాజా అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రభునాథ్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## తీర ప్రాంత భద్రతకు సాగర్ డిఫెన్స్ అవసరం

**– దానిని కూడా రాజకీయం చేయడం జగన్‌కే చెల్లింది**

**– జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు**



**అమరావతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** వైఎస్ జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్‌కు తల్లి, చెల్లి, రాష్ట్రం, దేశం పట్ల ఎలాంటి బాధ్యతా భావం, భక్తి లేవని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. తీర ప్రాంత భద్రతను బలోపేతం చేయడానికి రానున్న సాగర్ డిఫెన్స్ ప్రాజెక్టును కూడా తరిమేస్తానని జగన్ మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో శత్రు దేశాల నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కొనేం దుకు ఈ ప్రాజెక్టు అవసరమని ఆయన పేర్కొన్నారు. తీర ప్రాంతంలో తమిళనాడు మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి వచ్చి సమస్యలు సృష్టించడం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. జగన్ హయాంలో మెరైన్ పోలీసుల గస్తీ బలహీన పడిందని పేర్కొన్నారు. 144 గ్రామాలకు సంబం ధించిన గ్రామ కాపుల సమావేశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉప యోగించుకునే ప్రయత్నం చేస్తు న్నారని విమర్శించారు. విశాఖపట్నం, కాకినాడ, జువ్వల దిన్నెలలో ఫిషింగ్ హార్బర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జెట్టీలు నిర్మించామని తెలిపారు. వైఎస్ఆర్ నుంచి జగన్ వరకూ మత్స్య కారులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిం చారు. సోంపేట ఘటనలో మత్స్యకారులపై కాల్పులు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే పరిహారాన్ని రూ.4 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచినట్టు తెలిపారు. మత్స్యకార సంక్షేమం కోసం కేంద్రం ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదని, ఫిష్ ఆంధ్రా పేరుతో నిధులు మళ్లించారని ఆరోపించారు.

ప్రధాని మత్స్య సంపద యోజన కింద మత్స్య కారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు

## జగన్ మోహన్‌రెడ్డి సర్.. ఇవేం రాక్షస చేష్టలు?: లోకేశ్



**అమరావతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి.. తరిమే స్తానని జగన్ అనడమేంటని మంత్రి నారా లోకేశ్ విమ ర్శించారు. ఇదేం రాక్షస మనస్తత్వమని అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనం దించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటికీ సైకోయిజమేనని వ్యాఖ్యానించారు.ేదు. దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు వస్తున్నాయంటే దోపిడీ అని గగ్గోలు పెడుతున్నారు. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసం నిండి ఉన్నాయి. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేసి, కంపెనీలన్నీ వెళ్లగొడతామంటున్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో బీవీకే జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ



**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** తాజాగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశాఖపట్నం విశాలాక్షి నగర్ బీవీకే జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి, ఉన్నత మార్కులతో విజయ దుందుభి మోగించారు. ఈ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారని గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జూనియర్ కాలేజీ కరస్పాండంట్ డాక్టర్ నందూరి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ఇందిరా సంయుక్త తెలిపారు. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల, కళాశాల యాజమాన్యం అందించిన బోధనా నైపుణ్యంతో ఈ ఘన విజయం సాధ్యమైందని తెలిపారు.రెండవ సంవత్సరం ఫలితాల్లో ఎస్ కే ముష్కాన్ 936 మార్కులు,టీ మణికంఠ 924 మార్కులు,బీ సంధ్య 906 మార్కులు సాధించారని తెలిపారు.మొదటి సంవత్సరం ఫలితాల్లో జె శశి ప్రియ 471 ,ఎన్ ప్రత్యక్ష 439, ఎస్ జానీ 466 ,ఈ గణేష్ 462 ,డీ హేమలత 454,పీ ధరణ్ కుమార్ 451, బి లలిత 447,బీ రోహిణి 444, ఎస్ భాగ్య శ్రీ 413 మార్కులు సాధించినట్లు తెలిపారు.గత ఏళ్లలాగే ఈ ఏడాది కూడా తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని తెలిపారు.తమ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ, బైపీసి,సిఈసి,ఎంఈసి ఒకేషనల్ కోర్సుల్లో మెడికల్ లేబరేటరీ టెక్నాలజీ (ఎం ఎల్ టీ), మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎం పీ హెచ్ డబ్ల్యు), ఫిజియోథెరపీ,కంప్యూటర్ గ్రాఫిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.తమ కళాశాలలో ఎన్ సి సి,ఎన్ ఎస్ ఎస్ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.పేద విద్యార్థులకు ఫీజులో రాయితీ కూడా కల్పిస్తున్నామని,దాతల సహకారంతో స్కాలర్ షిప్ లు కూడా అందచేస్తున్నట్లు తెలిపారు. అత్యున్నత విద్యావంతులైన బోధనా సిబ్బంది తమ కళాశాలలో సేవలందిస్తున్నారని, కేవలం విద్యాబోధన కాకుండా మానసిక వికాసం, శారీరక, సామాజిక వికాసానికి మాతృభాషలో బోధన, ఆటపాటలు, కౌన్సెలింగ్ తదితర అంశాలతో విద్యార్థుల్లోని మానసిక ఒత్తిడి తగ్గించి, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి తమ ఉపాధ్యాయ సిబ్బంది కృషిచేస్తారని తెలిపారు. అత్యాధునిక ఫిజిక్స్,బయోలాజి,కెమిస్ట్రీ సైన్స్ లేబరేటరీలు,కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.రోటరీ క్లబ్ సహకారంతో ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.ఆహ్లాదకర వాతావరణంలో,విశాలమైన వాలీ బాల్ కోర్ట్,బాస్కెట్ బాల్ కోర్ట్ అందుబాటులో ఉన్నాయని,సుమారు పదివేల పుస్తకాలతో గ్రంధాలయం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.ఎం సెట్ కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తామని,పోటీ పరీక్షలు ఎస్ ఎస్ సి,గ్రూప్స్,రైల్వే పరీక్షలకు అనుభవజ్ఞులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.రవాణా సౌకర్యం కూడా ఉన్నట్లు తెలిపారు.అత్యున్నత ప్రమాణాలతో,క్రమశిక్షణతో కొనసాగే తమ కళాశాల విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కాలేజీ లో తమ పిల్లలను చేర్చి ఉన్నత విద్యావంతులుగా,క్రమశిక్షణ గల భావిభారత పౌరులుగా తీర్చిద్దిద్దాలని తల్లి తండ్రులను కరస్పాండంట్ డాక్టర్ నందూరి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ఇందిరా సంయుక్త కోరారు.

## మహిళలు భద్రతపై ర్యాలీ మరియు అవగాహనా సదస్సు



**అనంతగిరి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** మండలంలోని జీనబాడు పంచాయతీ లో జీనబాడు గ్రామంలో అనంతగిరి సబ్ ఇన్స్పెక్టర్ కె, శంకర్ గారి ఆధ్వర్యంలో మహిళలభద్రతపై ర్యాలీ నిర్వహించారు మరియు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు గురించి అవ గాహనా సదస్సు నిర్వహించారు

ఈ కార్యక్రమంలో...

అనంతగిరి పోలీసు వారు స్థానిక మహిళలు పాల్గొనడం జరిగింది,

## మత్స్యకార భేటీ అద్భుత విజయం సాధించింది

**– జువ్వలదిన్నె రాకుండా జగన్‌కు ఆంక్షలు – మత్స్యకారులను బెదరించినా వచ్చారు**

**– జిల్లా వైసిపి అధ్యక్షుడు కాకాణి చక్రపాణి**



**నెల్లూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** కావలి నియోజకవర్గంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వేదికగా వైఎస్ జగన్ నిర్వహించిన మత్స్యకార భేటీ అద్భుత విజయం సాధించిందని, ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు పెట్టినా గంగపుత్రులు నీరాజనం పట్టారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. వైఎస్ జగన్ పర్యటనకు లభించిన భారీ స్పందన చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపిందని కాకాణి స్పష్టం చేశారు. జువ్వలదిన్నెలో వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలకు పాల్పడింది. హెలికాప్టర్ ల్యాండింగ్ అనుమతిని ఆఖరి నిమిషం వరకు పెండింగ్‌లో పెట్టారు. రవాణా శాఖ అధికారులతో వాహనాలను నిలిపివేసి, బారికేడ్లు పెట్టినా జనం ఆగలేదు. వేట సాగనివ్వమని, పథకాలు ఆపేస్తామని స్థానిక నేతలు మత్స్య కారులను బెదిరించినా, 4 వేల మందికి పైగా తరలివచ్చి వైఎస్ జగన్‌కి నీరాజనం పట్టారు. అది చూసి ఓర్చుకోలేకనో పచ్చ మీడియా రోత రాతలు రాస్తోంది. ఆ మీడియాల సర్టిఫికేట్లు మాకవసరం లేదు.జువ్వలదిన్నెలో వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా జిల్లా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు గర్హనీయం. 2011లో సోంపేట మత్స్యకారులపై కాల్పులు జరిగినప్పుడు ఆనం మంత్రిగా ఉన్నారు. ఆ విషయం ఆయన మర్చిపోయినట్లు ఉన్నారు. మత్స్యకారుల రక్త చరిత్ర జగన్‌ది కాదు. మీ హయాంలో జరిగిన కాల్పులది. సోంపేటలో థర్మల్ ఎ÷–లాంట్ వద్దు అన్నదే వైఎస్ జగన్. కానీ, మీరు మాత్రం అన్నీ మర్చిపోయారు. చంద్రబాబులా మతిమరుపుతో మాట్లాడు తున్నారు. ఇంకా తమ ప్రాంతానికి వచ్చి, తమ వలలు తెంపి చేపలు వేటాడుతున్న పొరుగు రాష్ట్ర మెకనైజ్డ్ బోట్లను స్థానిక మత్స్యకారులు స్వాధీనం చేసుకుంటే, వాటిని విడిచిపెట్టింది టీడీపీ నేతలు. ఈ విషయం ఆనంకు తెలియదా? జువ్వలదిన్నె హార్బర్ పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 2019–24 మధ్య జరిగాయి. అందుకే ఇకనైనా వాస్తవాలు మాట్లాడాలని అదే పనిగా అబద్దాలు వ్లలె వేయొద్దని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రి ఆనంకు హితవు చెప్పారు. వైఎస్ జగన్ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటనకు రావడం మత్స్యకారులకు భరోసానిచ్చింది. కావలి నియోజకవర్గంలో దురాయి వేసినా, ఎన్ని అంక్షలు పెట్టినా, మండుటెండను సైతం లెక్క చేయకుండా తరలి వచ్చిన వారందరికీ పార్టీ తరపున ధన్యవాదాలు. మత్స్యకారులకు ఆస్తిగా ఇచ్చిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రైవేటీకరణ చర్య సరికాదు. దీన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని అడ్డుకునేలా చూస్తాం. మత్స్యకారులకే హార్బర్ చెందేలా చేస్తాం. పొరుగు రాష్ట్రాల మెకనైజ్డ్ బోట్లు ఇక్కడ చేపల వేటకు వచ్చి ఇబ్బంది పెడుతున్నాయని, అవి వలలను తెంపి, తమ బోట్లను కూడా ధ్వంసం చేస్తున్నాయని స్థానిక మత్స్యకారులు మొర పెట్టుకుంటే జగన్ హామీ ఇచ్చారు. మరో వైపు పోలీసులు, మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉన్న బోట్లను దొంగచాటుగా ఎత్తుకుని పోతే వాటిని తీసుకుని రాకుండా ప్రభుత్వం, అధికార పార్టీ మీన మేషాలు లెక్కిస్తోంది. ఇప్పటికైనా ఆ బోట్లను వెనక్కి తీసుకుని రావాలి. మత్స్యకారులకు వైఎస్ జగన్ ఎప్పటికీ అండగా ఉంటారు. మత్స్యకారులకు తోడుగా నిల్చేలా వైఎస్ జగన్ 10 పిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టారు. ఆయన ఏ మంచి పని చేసినా కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసే పనిలో పడింది.

## నేడు శ్రీ నూకాలమ్మ నెల పండుగ మహోత్సవం



**భీమునిపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ నెల పండుగ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు గంట నూకరాజు శిల్లా కరుణాకర్ రెడ్డి మారోజు సత్య వరప్రసాద్ (గొల్ల బాబు) ఉసిరికల తాతాజీ గాడు యశ్వంత్ కుమార్ లు తెలిపారు నెల పండుగ సందర్భంగా మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అలాగే సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారి గుడి వద్ద నుండి నేల వేషాలతో గ్రామ పురవీధుల్లో భారీ ఊరేగింపు జరుగునని తెలియజేశారు

## జగన్ పాలనలో మహిళలకు పెద్దపీట ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి




**అమరావతి, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మరోసారి స్పష్టం చేశారు. జగన్ పాలనలో మహిళలకు 'గోల్డెన్ పిరియడ్' అనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. 'జగన్ పాలనలో మహిళల భద్రత కోసం దిశ చట్టం, యాప్, ప్రత్యేక పోలీస్ స్టేషన్లు తీసుకువచ్చారు. ప్రతి పథకంలో మహిళలకే ప్రాధాన్యం. అమ్మ ఒడి, చేయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉదాహరణలు. స్థానిక సంస్థల్లో 50? కంటే ఎక్కువగా మహిళలకు అవకాశం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది. మహిళా బిల్లుకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు. టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి వ్యాఖ్యలు అభ్యంతరకరం. కూటమి పాలనే మహిళలకు డార్క్ పిరియడ్. సాక్షాత్తు ఎంపీగా ఉన్న శబరినే సీఎంవో అధికారి అవ మాస్తే సీఎం చంద్రబాబు ఖండించలేదు. మహిళలపై అవమానకర వ్యాఖ్యల చేసిన చరిత్ర టీడీపీదే. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని చంద్రబాబును మహిళా ఎంపీ శబరి నిలదీయాలి. సోషల్ మీడియాలో మహిళలను అవమానిస్తున్నది టీడీపీనే. మహిళల గౌరవం గురించి మాట్లాడే ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## పూడి శ్రీహరికి బెయిల్ మంజూరు

**కుప్పం, ఏప్రిల్16 :** అక్రమ కేసును బనాయించి అరెస్టు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరికి బెయిల్ మంజూరైంది. శ్రీహరికి కుప్పం కోర్టు బెయిల్ మంజూరు చేసింది, 33 గంటల పాటు అక్రమంగా నిర్బంధించిన తర్వాత కోర్టులో హాజరుపరిచిన పూడి శ్రీహరికి బెయిల్ మంజూరు చేసింది కుప్పం కోర్టు.

# నేటి మనదేశమ్ సంపాదకీయం

## చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా ?

అంబేద్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే.. పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిడిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేద్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మంది మాత్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొంద రెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు, విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవు తున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్దతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ధ ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఎ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనను 2029 సార్వత్రిక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్దంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యేలుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.


## వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా
## డాక్టర్ మంచా నాగ మల్లేశ్వరి



**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, ఏప్రిల్ 16 :** మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నాయకురాలు డాక్టర్ మంచా నాగ మల్లేశ్వరిను వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గా నియ మించడం పట్ల వైసీపీ కార్యకర్తల్లో మరింత ఉత్సాహం రెట్టింపు అయింది. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ సాధారణ మహిళనైనా తనకు సాధికారతను అందించి, అన్నలా ఆదరించి, మర్యాదను కల్పించి, రాష్ట్ర కార్యవర్గంలో ప్రాధా న్యత ఇచ్చి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన వైయస్ జగనన్నకు హృదయపూర్వక ధన్య వాదాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి నిరంతరం ప్రోత్స హించిన సజ్జల రామకృష్ణ రెడ్డి, విశాఖ జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు, ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త కన్న బాబు, శాసనసభ మండలి సభ్యులు బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, తలసిల రఘురాం, ఆలూరి సాంబ శివారెడ్డి, శ్రీహరిలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపు తున్నమ్మన్నారు. తనకు అప్ప జెప్పిన బాధ్యతను త్రికరణ శుద్ధితో పనిచేసి పార్టీ బలోపేతానికి మరింత సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

అలాగే తన రాజకీయ ప్రయాణంలో తోబుట్టు వులా భావించి నిరంతరం అండగా నిలిచిన ప్రతి వైసీపీ కార్యకర్తకు, నాయ కులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.


## శ్రీ కనకమహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి
## డాక్టర్ కందుల లక్ష రూపాయల విరాళం



**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** విశాఖ వాసుల కొంగు బంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ కనక మహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు, నళిని దేవి దంపతులు లక్ష రూపాయిల విరాళం అందజేశారు. గురువారం ఆలయ ఈవో శోభారాణికి ఈ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ విశాఖ ప్రజలకు శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారు అంటే ఒక సెంటిమెంట్ ఉందన్నారు. అమ్మవారి మహత్యం తెలిసిన వారు మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చి అమ్మవారిని దర్శించుకుని ఆమె ఆశీస్సులు తీసుకుంటారని తెలిపారు. ఉత్తరాంధ్ర కు చెందిన వారు ఏవరైన తిరుపతి వెళ్తే ఆ తర్వాత నేరుగా సింహాచలం దర్శనం చేసుకుని ,అటు నుంచి అమ్మవారి ఆలయానికి వస్తారని పేర్కొన్నారు. భక్తితో అమ్మవారిని ఏది కోరుకుంటే అదే జరిగితీరుతుందనే నమ్మ కం ప్రజలలో ఉందన్నారు. ఆ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్రం ప్రజల పై ఉండాలని,రాష్ట్రం సుభిక్షంగా ఉండే విధంగా అమ్మవారిని ప్రార్ధించినట్లు ఈ సంద ర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, నాయుడు, కిరణ్, అప్పారావు, శ్రీకాంత్, ప్రశాంత్,వాసు, రమేష్, కేదార్నాధ్, బదిరీనాథ్, రవణ,రాజేష్,సుధ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల
## పరిష్కార వేదిక నిర్వహించిన గంటా



**భీమునిపట్నం ఏప్రిల్ 16 నేటి మనదేశమ్ :** భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వ హించారు. వివిధ సమస్యలపై ప్రజలు ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. 3 వ వార్డు కృష్ణా కాలనీలో బోర్ వెల్ కావాలని, ఎస్సీ కాలనీలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. పోస్టాఫీసు సచివాలయంలోకి మార్చాలని.. గొల్లలపాలెం, కుమ్మరిపాలెంలలో రోడ్లు, డ్రెయిన్లు కావాలని విజ్ఞప్తి చేశారు. చిప్పాడలో తమకు చెందిన ఎకరం భూమిని 22 -ఎ లో పెట్టారని.. ఆ స్థలంలో దివీస్ యాజమాన్యం హైస్కూల్ నిర్మించిందని బధిరులైన సరగడ అచ్చియమ్మ, రమణమ్మ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సొంతిల్లు లేనందున తమకు సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలం కేటాయించాలని విన్నవించారు. భీమిలి ఫుట్ బాల్ స్టేడియంలో యూజర్ ఛార్జీలు వసూలు నిలిపివేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, ఎమ్మార్వో పి.రామారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కొల్లి రాఘవేంద్ర రావు కి
## "తెలుగు శక్తి" బి.వి.రామ్ నివాళి



**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** బిజెపి సీనియర్ నాయకురాలు కొల్లి రత్నకుమారి భర్త స్వర్గీయ శ్రీ కొల్లి రాఘవేంద్ర రావు దశ దిన కర్మ కార్యక్రమంలో గురువారం మధ్యాహ్నం కాకతీయ ఫంక్షన్ హాల్, మద్దిలపాలెం, విశాఖ పట్నంలో తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ పాల్గొని నివాళులర్పించారు. ఈ సమయంలో వారి కుటుంబ సభ్యులకు ముఖ్యంగా కొల్లి రత్న కుమారికి భగవంతుడు వారికి ధైర్యం, శక్తి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. మా తండ్రి గారైన స్వర్గీయ బి.వి.రామారావుతో వారి కుటుంబ సభ్యులతో మంచి అను బంధంగా ఉండేదని, ఈ సందర్భంగా బి.వి.రామ్ గుర్తు చేసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ ను కలుసు కున్నారు.


## అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం



**భీమునిపట్నం, ఏప్రిల్ 16 నేటి మన దేశమ్ :** జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు 3వ రోజున అగ్నిమాపక వాహనంలో సిబ్బందితో బయలుదేరి సంగివలస నందు గల కృష్ణా రెసిడెన్సి-2&3 (రెండు అపార్ట్మెంట్స్ వసూలు) లో జాయింట్ గా అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమము నిర్వహించడంచడమైనది. ఈ కార్యక్రమంలో భాగంగా...

వివిధ రకాల అగ్నిప్రమాదాలు గురించి వివరణ ఇచ్చి వాటిని నివారించే పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు విపులంగా వివరించారు.

## అవంతి కళాశాలల మెగా జాబ్ మేళాలో
## 244 మందికి ఉద్యోగవకాశాలు



**భీమునిపట్నం ఏప్రిల్ 16 నేటి మనదేశమ్ :** అవంతి కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 15 బహుళజాతి సంస్థలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనలో పాల్గొనగా ఈ జాబ్ మేళాకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నిరుద్యోగ విద్యార్థులు సుమారు 802 మంది అభ్యర్థులు హాజరైనారు, తుది నియమకాలలో 244 మంది అభ్యర్థులను ఎంపిక చేసి నియామక పత్రాలను అంద చేసినారు. ఈ కార్యక్రమమును అవంతి విద్యా సంస్థల చైర్మన్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్స్ డైరెక్టర్స్, ప్లేస్మెంట్ అధికారులు పర్యవేక్షించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు అవంతి శ్రీనివాస రావు అభినంధించి ప్రశంసించారు.

అవంతి కళాశాలలో...

చదువుకున్న ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాము కల్పించాలానే ధ్యేయ ముతో కట్టుబడి ఉన్నానని అలాగే వాళ్ళ తల్లి దండ్రులకు చదువుకున్న విద్యా సంస్థకి మంచి పేరు ప్రఖ్యాతలు, గౌరవము తీసుకు రావాలని అభిప్రాయపడ్డారు.

## పల్లా వెంకటేష్ మాస్టర్ సేవలు మరువలేనిది



**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** గాయకుడిగా, సంగీత సేవా సంస్థల అధినేతగా పల్లా వెంకటేష్ మాస్టర్ కళా రంగానికి చేసిన సేవలు మరువలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ద్వారకానగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో పల్లవి మ్యూజిక్, వెంకీ రిథమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల దివంగతులైన పల్లా వెంకటేష్ మాస్టర్ స్మారకార్థం నిర్వహించిన మధుర గీతాలతో పుష్పాంజలి ఘటించారు. పల్లా బాబ్జి, ఆదారి వెంకట్, భాగ్యలక్ష్మి, సివీ రాజేశ్వరి, సంజయ్ రామ స్వామి, పావని, ఎల్ వెంకటేష్, సుజాత కంఠ, నరసింగరావు, రంజిత, ప్రవీణ్ లు సినీ విషాద గీతాలు ఆలపించి నివాళి అర్పించారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించిన కార్యక్రమంలో...


వివిధ కళాసంస్థల అధినేతలు చెన్నా తిరుమలరావు, భయ్యా శ్రీనివాస్, సన్ మూర్తి తదితరులు వెంకటేష్ మాస్టర్ సేవల్ని కొనియాడారు.

– చెన్నా సెల్ 8179605267


## మహిళపై జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమం

**భీమునిపట్నం ఏప్రిల్ 16 నేటి మనదేశమ్ :** స్థానిక కేజీబీవీ స్కూల్లో స్థానిక పోలీస్ స్టేషన్ సిఐ బి.తిరుమలరావు మరియు సిబ్బందితో కలిసి మహిళపై జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ గంగా కుమారి స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు

# రోజుకు ఎన్ని గుడ్లు తినాలో తెలుసా ?



రోజూ ఒక గుడ్డు తింటే అనారోగ్యం దరిచేరదనే మాట తరచూ వింటూ ఉంటాం. అయితే ఎక్కువ గుడ్లు తినడం వల్ల అనేక రకాల ఇబ్బందులు ఉంటాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. అసలు రోజుకు ఎన్ని గడ్లు తింటే ఆరోగ్యానికి మంచిదనే వివరాలు తెలుసుకుందాం. కోడి గుడ్లలో కోలిన్, ఫోలేట్, విటమిన్-డి, అయోడిన్, బి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అయినా వీటిని ఎక్కువ తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రరిణామాలు కూడా ఉన్నాయి. కొలెస్ట్రాల్ సమస్య ఉన్న వారు గుడ్లు ఎక్కువ తినకూడదు. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుంది.రక్తపోటు ఎక్కువగా ఉన్నా వారు కూడా గుడ్లు ఎక్కువగా తినకూడదని నిపుణులు చెబుతున్నారు. అయితే గుడ్డులోని పసుసు భాగాన్ని పక్కకు తీసేసి, మిగతా భాగాన్ని తినడం మంచిది. పసుపు భాగంలో కొవ్వు ఎక్కువగా ఉండడం వల్ల అధిక రక్తపోటు ఉన్నవారికి ఇబ్బంది కలగవచ్చు.అదే విధంగా గుడ్లు



ఎక్కువగా తినడం వల్ల బరువు కూడా ఎక్కువగా పెరిగే ప్రమాదం ఉంది. అలాగే శరీరంలో అధిక వేడిని కలిగిస్తాయి. మరోవైపు కడుపులో వికారం, తిమ్మిర్ల సమస్య కూడా తలెత్తవచ్చు. అదేవిధంగా బీపీ కూడా పెరిగి ప్రమాదం ఉంది.నిపుణుల అభిప్రాయం ప్రకారం వారానికి 7 నుంచి 10 గుడ్లు తినడం ఉత్తమం. అయితే ఎక్కువ వర్కవుట్లు చేసేవారు, ప్రొటీన్లు ఎక్కువగా అవసరమయ్యే వారు 4 నుంచి 5 గుడ్లు ఎక్కువ తిన్నా సమస్య ఉండదు. అయితే తెల్లసొన మాత్రమే తినడం వల్ల భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.





# కాఫీ తాగితే

## బరువు తగ్గుతారా..? పెరుగుతారా..?




ఉదయం లేచిన వెంటనే కాఫీ తాగాలని ప్రాణం కొట్టుకుంటుంది. అయితే కాఫీ తాగడం వల్ల బరువుతగ్గుతారనే ప్రచారం మరిప్పుడు ఎందరిని కాఫీ వెనక పరుగులు పెట్టేలా చేస్తుందో తెలీదు. కాఫీ కావాలని.. అడగడం కాదు ఇక నుంచి కాఫీ తెగ తాగేస్తారేమో.. అసలు కాఫీ గురించి ఈ పరిశోధనలో ఇంకేం తెలిసాయంటే..కాఫీ తాగడం వల్ల షుగర్ పేషెంట్స్ కి చాలా మంచిది. దీనిని తాగడం వల్ల శరీరంలోని ఇన్సులిన్ సరిగ్గా ఉపయోగించు కుంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్లెయిన్ కాఫీని తాగితే తగిన ఫలితం ఉంటుంది. అదనంగా కొవ్వు, క్యాలరీలు మంచి నిర్ణయం అయితే కాదు. కాఫీకి ఎప్పుడూ తీపిని ఎక్కువ జత చేయకూడదట..అంతే కాదు కాఫీలోని కొన్ని గుణాలు క్యాన్సర్ వచ్చే రిస్క్ ని 12 శాతం వరకూ తగ్గించే అవకాశం ఉందని తేల్చింది. ఈ లక్షణాలన్నీ బరువు తగ్గించడంలో సహాయపడతాయట..కాఫీ దీర్ఘకాలిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. రోజుకు మూడు నుండి నాలుగు కప్పుల ఇన్‌స్టంట్ కాఫీ తాగడం వల్ల గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, కొన్ని క్యాన్సర్‌లతో సహా అనేక ఆరోగ్య పరిస్థితుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. చాలా మంది వయస్సు పెరిగే కొద్దీ ప్రతి సంవత్సరం చిన్న మొత్తంలో బరువు పెరుగుతారు. అయితే ఈ క్రమేణా బరువు పెరుగుటాన్ని నిరోధించడంలో కాఫీ సహాయపడుతుందా? పరిశోధకుల బృందం రోజుకు ఒక కప్పు అదనంగా కాఫీ తాగడం లేదా చక్కెర, క్రీమ్ లేదా పాల ప్రత్యామ్నాయాన్ని కలపడం వల్ల ఎక్కువ లేదా తక్కువ బరువు పెరుగుతుందా అని పరిశీలించారు. ఈ పరిశోధన కాఫీ, ఊహించిన దాని కంటే తక్కువ బరువు పెరగడం కొన్ని కొత్త విషయాలు తెలిసాయి. రోజుకు ఒక కప్పు అదనంగా కాఫీ తాగే వ్యక్తులు నాలుగేళ్లలో ఊహించిన దానికంటే 0.12 కిలోల బరువు తగ్గారు. చక్కెరను జోడించడం వల్ల నాలుగు సంవత్సరాలలో ఊహించిన దానికంటే కొంత భాగం (0.09 కిలోలు) బరువు పెరిగింది.

# ఎండుద్రాక్ష ఎంతో ఘనం!



ఎండుద్రాక్ష ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఛాతీలో మంటను తగ్గిస్తుంది. జీర్ణకోశ వ్యవస్థను సజావుగా పనిచేయిస్తుంది. ఎండుద్రాక్షలో ఒకరకమైన మునెక్కాను నానబెట్టి తినటం మరిన్ని ఎక్కువ ప్రయోజనాలు కలిగిస్తుంది. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అయితే మధుమేహం గలవారు వీటిని మితంగానే తినటం మంచిది. మునెక్కాలో నీటిలో కరిగే పీచు దండిగా ఉంటుంది. ఇది ఎక్కువెక్కువ తినకుండా చూస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. కొవ్వును కరిగించే లెప్టిన్ హార్మోన్ మోతాదు పెరిగేలా చేస్తుంది. ఇది జీవక్రియల వేగాన్ని పెంచుతుంది. ఇవన్నీ బరువు తగ్గటానికి తోడ్పడేవే. వీటిల్లో కణాల్లో వాపు ప్రక్రియను అణచే, రక్తనాళాల్లో పూడికలను తొలగించే రిస్‌వెరటాల్ రసాయనమూ ఉంటుంది. ఇది చెడ్డ కొలెస్ట్రాల్ మోతాదులను తగ్గిస్తుంది. రక్త నాళాలు విప్పారేలా చేస్తుంది. దీంతో రక్తపోటు తగ్గుముఖం పడుతుంది. ఇలా గుండెకు మేలు చేస్తుంది. దీనిలోని వాపు నివారణ, యాంటీసెప్టిక్ గుణాలు నోటి పూత, చిగుళ్లవాపు తగ్గటానికి తోడ్పడతాయి.

# సరికొత్త ట్రెండ్ ఉంగారాల చెయిన్లు..!



వేళ్లకి ఉంగరాలు, మెడలో గొలుసులు ధరించడం సాధారణమే! చేతులకు ఉంగరాలు.. చెయిన్లు, హ్యాండ్ కఫ్స్ ధరించడం ఇప్పుడు ట్రెండ్. ఇండోవెస్ట్రన్, వెస్ట్రన్ డ్రెస్సుల మీదకు ఈ ఉంగరాలు, చెయిన్ల వరసలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. యువత వేగానికి, స్టయిల్‌కి అద్దంలా భాసిల్లు తున్నాయి.



బంగారు వరసలు : లైట్ వెయిట్ జ్యువెలరీలో భాగంగా హ్యాండ్ కఫ్స్, చెయిన్స్ డిజైనర్లను ఆధునికత వైపుగా పరుగులు తీయిస్తున్నాయి. ఆభరణాల డిజైనర్లు బంగారు లోహంతో వెస్ట్రన్ స్టైల్ డిజైన్స్‌ను కొత్తగా మెరిపిస్తున్నారు.

వెండి వెలుగులు తక్కువ ఖర్చు అనే జాబితాను ఈ తరం పక్కన పెట్టేస్తోంది. ఏ డిజైన్ తమకు మరింత అందాన్ని తీసుకువస్తుందో, నలుగురిలో గుర్తింపును సంపాదిస్తుందో దానినే ఇష్టపడుతోంది. అందుకే సిల్వర్ డిజైన్స్ మరింతగా యువత మదిని గెలుచుకుంటున్నాయి.

స్టీల్ మెరుపులుస్ట్రీట్ అండ్ బోహెూ స్టైల్‌లో స్టీల్‌తో తయారైన ఆభరణాలను యువత ఎక్కువ ధరిస్తుంటుంది. క్యాజువల్ వేర్, పార్టీవేర్‌కీ నప్పే ఈ డిజైన్ వరసలు వందల రూపాయల నుంచి మార్కెట్‌లో లభిస్తున్నాయి.

# ఆకలికి ఫోలిక్ యాసిడ్



ఫోలిక్ యాసిడ్ మాత్రలను మహిళలకు.. ప్రత్యేకించి గర్భిణులకు సూచిస్తుండటం తెలిసిందే. ఇది పిండంలో అవకరాలు ఏర్పడకుండా కాపాడుతుంది మరి. పిండం తొలిదశలో న్యూరల్ ట్యూబ్ ఏర్పడుతుంది. దీన్నుంచే మెదడు, వెన్నుపాము పుట్టుకొస్తాయి. ఈ న్యూరల్ ట్యూబ్ ఏర్పడటానికి ఫోలిక్ యాసిడ్ తోడ్పడుతుంది. అందువల్ల మెదడు, వెన్ను లోపాల వంటి తీవ్ర అవకరాల నివారణకిది చాలా ముఖ్యం. నిజానికి ఫోలిక్ యాసిడ్ అనేది ఫోలేట్‌కు (విటమిన్ బి9) కృత్రిమ రూపం. మాత్రలు, సిరప్‌లలో ఉండేది ఇదే. బి విటమిన్లలో ఒకటైన ఇది కణాల వృద్ధికి, విభజనకూ సాయం చేస్తుంది. చర్మం, వెంట్రుకలు, గోళ్ల వంటి వాటిల్లో రోజూ కొత్త కణాలు పుట్టుకొస్తుంటాయి కదా. ఇవి సక్రమంగా వృద్ధి చెందటానికి ఫోలిక్ యాసిడ్ ఉపయోగపడుతుంది. అంతేకాదు.. విటమిన్ బి 12, విటమిన్ సితో కలిసి ప్రొటీన్లనూ విడగొడుతుంది, హిమోగ్లోబిన్ తయారీలోనూ పాలు పంచుకుంటుంది. జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం తయారయ్యేలా చేసి, ఆకలిని పెంచుతుంది కూడా. ఫోలిక్ యాసిడ్ కాలేయంలో నిల్వ ఉంటుంది. జీర్ణాశయం, పేగుల్లోని బ్యాక్టీరియా కూడా దీన్ని కొంతవరకు తయారుచేస్తుంది. ఇది లోపిస్తే ఎదుగుదల కుంటుపడుతుంది. వెంట్రుకలు తెల్లబడతాయి.

# డార్క్ సర్కిల్స్‌తో బాధపడుతున్నారా? ఈ బ్యూటీ టూల్ ఉంటే చాలు



ముఖంలో కళ్లు ఎంత ప్రత్యేకమో అంతే సున్నితం. కళ్ల విషయంలో ఎప్పటికప్పుడు సురక్షితమైన జాగ్రత్తలు తప్పనిసరి. పైగా కళ్ల చుట్టూ నల్లటి వలయాలు, మచ్చలు ముడతలు వంటి సమస్యలను దూరం చేయాలంటే.. ఇక్కడ కనిపిస్తున్న మసాజర్‌ని వెంట ఉంచుకోవాల్సిందే.ఈ మాన్యువల్ ఐ అండ్ ఫేస్ మసాజర్.. కళ్లకు సంబంధించి పర్ఫెక్ట్ బ్యూటీ టూల్ అని చెప్పుకోవచ్చు. ముఖానికి కూడా చక్కటి మసాజ్‌ని అందిస్తుంది.

ఇది ఐ బ్యాగ్స్‌ని దూరం చేయడంతో పాటు డార్క్ సర్కిల్స్‌ని తొలగించి కళ్లను, ముఖాన్ని అందంగా మారుస్తుంది. మసాజర్‌లోని బాల్ 360 డిగ్రీలు తిరుగుతూ సరికొత్త యవ్వనాన్ని అందిస్తుంది. కంటి చుట్టూ సున్నితంగా మసాజ్ చేస్తూ ముఖ కండరాలను రిలాక్స్ చేస్తుంది. రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. నుదుటి మీద ఏర్పడే ముడతలను దూరం చేయడంతో పాటు.. పెదవులు, బుగ్గల మధ్య ఏర్పడే సన్నటి గీతలను పోగొడుతుంది.

దీని ఎర్గోనామిక్ నాన్ - స్లిప్ హ్యాండిల్.. కాంపాక్ట్ డిజైన్‌తో, స్కిన్ ఫ్రెండ్లీ టచ్‌తో.. ఏ వేళలోనైనా ఎక్కడైనా వినియోగించడానికి.. చాలా సులభంగా ఉంటుంది. ఈ టూల్ ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లగలిగేంత చిన్నది. తేలికైనది కూడా. ఇది చిన్న హ్యాండ్ బ్యాగ్‌లో లేదా కాస్మెటిక్ బ్యాగ్‌లో చక్కగా సరిపోతుంది. మెరుగైన ఫలితాలను పొందడానికి దీన్ని క్రమం తప్పకుండా ఉపయోగించాలి. ధర 199 డాలర్లు. అంటే 16,251 రూపాయలు. దీన్ని ప్రియమైన వారికి బహుమతిగానూ ఇవ్వచ్చు!



# బ్లాక్ యాపిల్ గురించి విన్నారా? ఒక్కొక్కటి ఏకంగా..



యాపిల్స్‌లో చాలా రకాలు మనకు తెలుసు. ఎక్కువగా ఎరుపు రంగులోను, ఎరుపు పసుపుల కలగలుపు రంగులోను, లేతాకుపచ్చ రంగులోను ఉంటాయి. ఈ నల్లని యాపిల్స్ వాటన్నింటి కంటే భిన్నమైనవి. ఇవి అత్యంత అరుదైనవి. ఈ నల్లని యాపిల్స్ చైనా అధీనంలో ఉన్న టిబెట్‌లోని న్యింగ్‌చీ పరిసర ప్రాంతాల్లో పండుతాయి. ఇవి చైనాలోని ఎరుపురంగు యాపిల్స్ అయిన 'హువా నియు' యాపిల్స్ జాతికి చెందినవే! టిబెట్‌లోని వాతావరణ పరిస్థితి కారణంగా పగటి వేళల్లో ఎండ కాసేటప్పుడు వీటిపై అల్ట్రావయొలెట్ కిరణాలు పడటం, రాత్రివేళల్లో హఠాత్తుగా ఉష్ణోగ్రత తగ్గిపోవడం కారణంగా ఈ ప్రాంతంలో పండించే 'హువా నియు' యాపిల్స్ పూర్తిగా నలుపు రంగులోను, నేరేడుపండ్ల మాదిరిగా ముదురు ఊదారంగులోను పండుతాయి. అందువల్ల వీటికి బ్లాక్ డైమండ్ యాపిల్స్ అనే పేరు వచ్చింది. ఈ యాపిల్స్ చైనా మార్కెట్‌లో ఒక్కొక్కటి 50 యువాన్ల (రూ.575) వరకు పలుకుతాయి.



# రోజూ తలస్నానం చేస్తున్నారా?



చాలా మంది ఏదైనా చిట్కా చెప్పిన లేదా పెద్దలు ఇది మంచిదన్నా వెంటనే చేసేస్తుంటారు. ఇది అన్నివేళాల మంచిది కాకపోవచ్చు. ఎందుకంటే ఆ చిట్కా మనకు పనిచేస్తుందో కూడా గమనించాలి. మన శరీరతత్వం, ఆరోగ్య పరిస్థితిని పరిగణలోని తీసుకునే ఆచరించాలి. లేదంటే తగ్గడం అటుంచి లేనిపోని సమస్యలు తలెత్తే ప్రమాదం పొంచి ఉంటుంది జాగ్రత్త!. ఇంతకీ జుట్టుకి సంబంధించి చాలా రెమిడీలు వినేఉండుంటారు. అందులో చాలా మంది రోజు తలస్నానం చేస్తే మంచిదని పలువురు చెప్పారు. దీంతో చాలామంది ఆ మాట మీద నమ్మకంతో ఆచరించేస్తుంటారు. ఇది కరెక్ట్ కాదు. మీదు పొడిజుట్టు, జిడ్డుగా ఉండే జుట్టు అనేదాని బట్టి ఆ రెమిడీని అనుసరించలి. ఇక్కడ జుట్టు తత్వాన్న అనుసరించే ఏ చిట్కానైనా ఫాలోకండి. చెప్పారు కదా అన్ని చేసేయొద్దు!. ఇంతకీ ఎలాంటి వారు రోజు తలస్నానం చేయడం మంచిది? ఎవరూ చేయకూడదో ? చూద్దాం!

# పిల్లల ఎముకలు బలంగా పెరగాలంటే..



పిల్లల ఎదుగుదల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహిం చాలి. ఎందుకంటే పెద్ద వారితో పోల్చితే పిల్లల ఎముకలు బల హీనంగా ఉంటాయి. దీనివల్ల చిన్న చిన్న దెబ్బలు తాకినా తొందరగా విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. బాల్యంలోని బలమైన ఎముకలు వారి జీవితకాల ఆరోగ్యానికి అద్భుతమైన పునాదిని అందిస్తాయి. అందువల్ల వారి ఎముకలు దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన ఆహార నియమాలపై అవగాహన కోసం...

**కాల్షియం** : గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి, కండరాలను బలోపేతం చేయడానికి, ఎముకలను అభివృద్ధి చేయడానికి కాల్షియం అవసరం అని తెలుసు కాబట్టి పిల్లలు రోజుకు కనీసం రెండు గ్లాసుల పాలను తాగేట్టు చూడాలి. అలాగే ఆహారంలో బచ్చలికూర, పాలకూర వంటి ఆకుకూరలు, బెండ, పొట్ల వంటి కూరగాయలు ఉండేట్టు చూడండి. అలాగే రోజుకు ఒకసారైనా పెరుగును తినేట్టు చూడండి. సోయా పాలు, సోయా పెరుగు వంటి సోయాబీన్ ఉత్పత్తుల్లో కూడా కాల్షియం పుష్కలంగా ఉంటుంది.




**విటమిన్ డి** : శరీరానికి కావలసిన కాల్షియంను గ్రహించేందుకు విటమిన్ డి సహాయపడుతుంది. విటమిన్ డి సూర్యరశ్మి ద్వారా, కొన్ని రకాల ఆహారాల ద్వారా పొందవచ్చు. పిల్లల ఆహారంలో తగినంత విటమిన్ డి లేకపోతే విటమిన్ డి సప్లిమెంట్‌ను తీసుకోవాలి. నవజాత శిశువులకు కూడా విటమిన్ డి సప్లిమెంట్స్ అవసరం. కానీ డాక్టర్లను సంప్రదించిన తర్వాతే ఇవ్వాలి.

**మెగ్నీషియం, విటమిన్ కె** : శరీరంలో విటమిన్ కె, మెగ్నీషియం స్థాయిలు ఎక్కువగా ఉంటే ఎముకలు బలంగా ఉంటాయి. అలాగే రికెట్స్, బోలు ఎముకల వ్యాధితో సహ ఎన్నో ఎముకల సమస్యలను తగ్గించడానికి ఇవి సహాయపడతాయి. కాల్షియంతో పాటుగా ఈ విటమిన్లు కూడా మీ పిల్లల ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. బచ్చలికూర, %వీ%క్యాబేజీ, మొలకలు వంటి వాటిల్లో విటమిన్ కె, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. పిల్లలకు తృణధాన్యాలను పెట్టండి.

**కార్బోనేటేడ్ పానీయాలు వద్దే వద్దు**

కార్బోనేటేడ్ పానీయాలలో సాధారణంగా కొన్ని ఫాస్ఫోరిక్ ఆమ్లాలు ఉంటాయి. ఇది శరీరం కాల్షియాన్ని గ్రహించకుండా నిరోధిస్తుంది. ఈ ఆమ్లం ఎముకల ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కార్బోనేటెడ్ పానీయాలకు బదులుగా నారింజ రసం వంటి హెల్తీ పానీయాలను తాగించండి. ఎముకలను బలోపేతం చేసేవాటిలో ముఖ్యమైనది శారీరక శ్రమ. అందుకే పిల్లలు బాగా ఆటలు ఆడేలా చూడండి. వీలైతే చిన్న చిన్న వ్యాయామాలను చేయించండి.



# కేసుల దర్యాప్తును సవాలుగా తీసుకోండి: ఎస్పీ




**విజయనగరం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** నేరస్వభావం మారుతుండడంతో కొత్తతరహా కేసులు నమోదవుతున్నాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఈ తరుణంలో కేసుల దర్యాప్తును సవాలుగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. బుధవారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న వివిధ కేసులు, చార్జిషీట్ల సమీక్ష చేశారు. అనంతరం ఎస్పీ మట్లాడుతూ కేసుల మిస్టరీలను ఛేదించేందుకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగం.. వ్యక్తిత్వ హననానికి పాల్పడటం వంటివి తీవ్రంగా పరిగణించా లన్నారు. గంజాయి నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణకు ప్రాధాన్యం ఇవ్వా లన్నారు.

క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సాక్ష్య యాప్‌ను వినియోగించుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌమ్య లత, డీఎస్పీలు గోవిందరావు, ఎస్. రాఘవులు, వీరకుమార్, న్యాయసలహాదారులు వై.పరశురాం, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫెయిల్ ...
## చెరువులో దూకి విద్యార్థి ఆత్మహత్య





**చాపాడు(మైదుకూరు) ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఫెయిల్ అవ్వడంతో మనస్తాపం చెందిన విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం కడప జిల్లా మైదుకూరులో జరిగింది.మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన జి.హరి ఈశ్వర్ (18) సమీపంలోని చెరువులో పడి మృతి చెందాడు. మృతుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి. ఫైయిల్ అయినట్లు సమాచారం. అలాగే ఈశ్వర్ తండ్రి మునెయ్య ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. ఫలితాలు విడుదల అయిన తరువాత ఈశ్వర్ ఇంటి నుంచి వెళ్ళిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జన గణనపై శిక్షణ తరగతులు



**ఆలమూరు (కోనసీమ) ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** మండల పరిషత్ కార్యాలయంలో జన గణన పై ఏన్యుమరేటర్లకు గురువారం రెండవ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ ఉపాధ్యాయులు జి.ఎస్.చక్రవర్తి, వై.వి.వి.రమణలు మాట్లాడుతూ మండల పరిధిలోని ఏన్యున రేటర్లకు మూడు విభాగాలుగా విభజించి శిక్షణ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సుమారు 50 మంది ఈ శిక్షణకు హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

ఇందులో భాగంగా జన గణనకు సంబంధించి అన్ని విషయాలను శిక్షకులకు పూర్తిస్థాయిలో వారు వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ మంగారావు, ఆర్ ఐ రామయమ్మ, బి గుమస్తా సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, ఏన్యునరేటర్లు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎం.వి.ఎస్.ప్రసాద్ ఎంపిక కావడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు



**కొయ్యూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎం.వి.ఎస్. ప్రసాద్, ఎంపిక కావడం పట్ల కొయ్యూరు మండల పరిధిలోని పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్య కర్తలు హర్షాతి రేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు సీనియర్ నాయకులు కాకూరు చందర్రావు, దుచ్చరి చిట్టిబాబు, మరియు గాడి శ్రీరామ్ మూర్తి ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయుడు కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు,ధన్యవాదాలు తెలిపారు.: పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు తెలుగుదేశం పార్టీలో ఎప్పుడూ సరైన గుర్తింపు ఉంటుందని ఈ నియామకం ద్వారా మరోసారి నిరూపిందమైందన్నారు. ఎం.వి.ఎస్. ప్రసాద్ సామర్థ్యాన్ని గుర్తించి, ఆయనకు రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారికి కొయ్యూరు మండల నాయకత్వం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాము. పార్టీ బలోపేతానికి బాటలు: ఎం.వి.ఎస్. ప్రసాద్‌కి ఉన్న రాజకీయ అనుభవం, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా మన ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్న ఎం.వి.ఎస్. ప్రసాద్‌కి వారు హృదయ పూర్వక అభినందనలు మండల పార్టీ అధ్యక్షుడు కాకూరు చందర్రావు, మాజీ జడ్పిటిసి గాడి శ్రీరామ్మూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షులు దుచ్చరి చిట్టిబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీ కళలకు రెక్కలు తొడిగే అద్భుతమైన వేదిక ఈ జాబ్ మేళా
## అవంతి కళాశాలల చైర్మన్ ముత్తంశెట్టి




**భీమునిపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలను అన్వేషించాలనుకునే పట్ట బద్రులకు ఒక ముఖ్యమైన వేదికగా అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలిజికల్ అకాడమి బోగాపురం క్యాంపస్ లో అవంతి కళాశాల అదినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో "అవంతి భారీ జాబ్ మేళా" నిర్వహించారు. ఈ జాబ్ మేళా లో టీ.వీ.యస్,ఫాక్స్కన్,ఎంపినోల్ ,అపోలో టైర్స్ లిమిటెడ్,ఇండో - మిమ్,టాటా ఎలక్ట్రానిక్స్,ఇసాన్ ఎక్స్పీరియన్స్,టి.ఎచ్.కే.కన్సన్ ట్రెక్స్,కాజెంట్ ఈ సొల్యూషన్స్ లిమిటెడ్,డబ్లూ. ఎన్.యస్, ఎ.యమ్.సిస్,నోవల్ ఫేటెంట్ సర్వీస్,తదితర 15 ప్రముఖ కంపేనీలు పాల్గొన్నాయి .అవంతి ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాశాల ల చైర్మన్ అవంతి మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకునెందుకు ఇటువంటి జాబ్ మేళా లు ద్వారా లభించే మంచి అవకాశాలు ను సద్వినియోగం కోవాలని సూచించారు. నిరుద్యోగులకు మెరుగైన ఉపాది కల్పించాలనే ఉద్దేశంతో ఈ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని అన్నారు. కంపెనీ సీఈఓ లు మాట్లాడుతూ "మీ కలలకు రెక్కలు తొడిగే అద్భుతమైన వేదిక ఈ అవంతి జాబ్ మేళా. కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, మీలోని నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశంగా దీన్ని భావించండి. సరైన ఆశయం, కష్టపడే తత్వం ఉన్న యువత కోసం మా సంస్థ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయండి - విజయం మీదే అని అన్నారు. మారుతున్న కాలంతో పాటు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోగల సామర్థ్యం నేటి యువతకు అవసరం. ఈ జాబ్ మేళా ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను మా సంస్థలోకి ఆహ్వానిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ మీరు పొందేది కేవలం జీతం మాత్రమే కాదు, మీ కెరీర్‌ను నిర్మించుకునే ఒక గొప్ప పునాది.అని తెలిపారు."అవంతి కళాశాల విద్యార్థులలో ఉన్న క్రమశిక్షణ, నేర్చుకోవాలనే తపన మాకు బాగా తెలుసు. అందుకే మా కంపెనీకి అవసరమైన రేపటి నాయకులను వెతుక్కుంటూ మేము ఇక్కడికి వస్తున్నాం. మీ ప్రతిభను నిరూపించుకోండి, మాతో కలిసి ప్రయాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించండి." హితవు పలికారు.అవంతి విద్యా సంస్థల డీన్ (ప్లెస్ మెంట్) డా.శ్రీనివాసరావు మాట్లాడుతూ అవంతి కళాశాల లో భవిష్యత్తు లో మరిన్ని మెగా జాబ్ మేళా లు నిర్వహించి నిరుద్యోగులకు,కంపెనీలకు మద్య వారధిగా కొనసాగుతామని తెలిపారు.అనంతరం ఇంటర్వ్యూ లో 500 మంది నిరుద్యోగులు హాజరుకాగా అర్హత సాధించిన 200 మందికి అవంతి శ్రీనివాసరావు ఉద్యోగం నియామక పత్రాలు ను అందించారు.ఈ కార్యక్రమం లో వైస్ కె.బాస్కర్ రావు,కళాళాల ప్రతినిది ముత్తంశెట్టి మహేష్,ఏఓజి ఆశోక్ కుమార్,వివిద విబాగాల అతిథులు, బోదన,బోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# 23 వ రోజు కు జిజిహెచ్ ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ రిలే నిరాహార దీక్షలు





**కాకినాడ, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద మార్చి 25 న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 23వ రోజైన గురువారం కూడా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు మట్టా హరనాథ్, పోర్ట్ యూనియన్ నాయకుడు ఆవుల కాశి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు లంకే ధర్మ మాట్లాడుతూ జిజిహెచ్ లో గత 20 సంవత్సరాలు గా సెక్యూరిటీ కాంట్రాక్ట్ పద్ధతిలో నడుస్తుందన్నారు. కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ వారు సిఐటియు అనుబంధ సభ్యులను 5 గురిని విధులకు దూరం చేసారన్నారు. 23 రోజులుగా రిలే నిరాహారదీక్ష చేస్తున్నామన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం ఒక్కో సెక్యూరిటీ గార్డ్ నెల జీతం లో సుమారు 2300 రూ. కాజేస్తున్నారని విమర్శించారు. గత చాలా కాలంగా అమలవుతున్న క్యాజువల్ లీవులు పూర్తిగా రద్దు చేసారన్నారు. దీనిపై విచారించి కార్మికులకు న్యాయం చేయాల్సిన జిజిహెచ్ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా సెక్యూరిటీ కాంట్రాక్ట్ యాజమాన్యం కూడా కార్మిక శాఖ ఆదేశాలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ కి నేటికీ ఫిబ్రవరి నెల జీతం జమ చేయలేదన్నారు. కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ ఎం.డి. రాజశేఖరరెడ్డి తో ఫోన్ లో సంప్రదించగా వచ్చే వారం కాకినాడ వస్తున్నట్లు తెలిపారన్నారు. 23 వ రోజు దీక్షల్లో సెక్యూరిటీ గార్డ్స్ లంకే ధర్మ, కె.భాగ్యలక్ష్మి, శేరు దుర్గ, పోతుల దేవి, ఎస్. శివగంగ లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ లతో పాటు అప్పన్న, బాలరాజు, శ్రీనివాస్, సోమరాజు , ధర్మారావు వల్ల ఆదినారాయణ, సురేష్, సత్యవతి , కృష్ణవేణి, రమేష్, కెవై కుమారి, రోజా, దేవి తదితరులు పాల్గొన్నారు.

# జాతరలో ఘర్షణ - ముగ్గురికి జైలు శిక్ష



**బైరెడ్డిపల్లి (చిత్తూరు) ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** మండలంలోని కామిదొడ్డి గంగమ్మ జాతరలో చోటుచేసుకున్న ఘర్షణ కేసుకు సంబంధించి ముగ్గురికి కోర్టు జైలుశిక్ష విధించింది. ఆదివారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల మేరకు ... జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణం వద్ద పలమనేరు ప్రాంతానికి చెందిన శరణ్ కుమార్, చంద్రశేఖర్, సుందరేష్ పరస్పరం గొడవకు దిగారు. మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీయడంతో అక్కడున్న ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బైరెడ్డిపల్లి ఎస్సై చందన ప్రియ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘర్షణకు దిగిన ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి పలమనేరు న్యాయస్థానానికి తరలించారు. కేసును విచారించిన జుడీషియల్ కోర్టు న్యాయమూర్తి వాదనలు విన్న అనంతరం ముగ్గురికి 15 రోజులు జైలుశిక్ష విధించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం వారిని మదనపల్లి సబ్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై చందన ప్రియ మాట్లాడుతూ .... జాతరలు వంటి వేడుకల్లో ప్రజలు శాంతియుతంగా వ్యవహరించాలని, గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి అశాంతి సృష్టించకుండా, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

# అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలి



**ఆత్మకూరు, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా పంట పొలాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లను తొలగించేందుకు విద్యుత్, అటవీశాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్ సూచించారు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి ఎకో టూరిజంలో విద్యుత్, అటవీశాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 డిసెంబరు 5న జరిగిన సమావేశంలోని పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ప్రత్యేకించి అటవీ సమీప, వ్యవసాయ క్షేత్రాల్లో వేటగాళ్లు అక్రమ విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేసి వన్యప్రాణులకు ముప్పు కలిస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటి నియంత్రణ కోసం గత మూడేళ్ల వ్యవధిలోని ఫీడర్లు, వారి ట్రిప్పింగ్ డేటాను ఈ నెల 25వ తేదీలోగా తమకు సమర్పించాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. అలాగే వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉండే ప్రాంతాల్లో అమర్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని తెలిపారు. అదేక్రమంలో ఆయా ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఆయా శాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. అలాగే వన్యప్రాణులకు విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు వీలుగా అన్ని తీసుకోనున్నట్లు వెల్లడించారు.

# అనంతపురం వ్యవసాయ డివిజన్ ఏడిఏ గా
## ఏ.వెంకట కుమార్ బాధ్యతలు స్వీకరణ



**అనంతపురం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్):** అనంతపురం వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులుగా ఏ. వెంకట కుమార్ గురువారం స్థానిక కక్కలపల్లిలోని రైతు సేవా కేంద్రం లో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు అనంతపురం మండల వ్యవసాయ అధికారిగా ఉన్న ఏ.వెంకట కుమార్ కు అనంతపురం ఏడిఏ గా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం పాఠకులకు విదితమే. నూతన అనంతపురం డివిజన్ ఏడిఏ గా ఏ.వెంకటా కుమర్ బాధ్యతలు చేపట్టిన కార్యక్రమంలో ... పలువురు ఎరువులు డీలర్లు, అనంతపురం వ్యవసాయ డివిజన్ లోని మండల వ్యవసాయ అధికారులు శ్యాంసుందర్ రెడ్డి, సోమశేఖర్, శుభకుమార్, సాంకేతిక వ్యవసాయ అధికారి సాయిలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ లావణ్య, వ్యవసాయశాఖ మినీ స్టీరియల్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసి డెంట్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 'సంభవం'... క్రేజీ ఐడియా ఇది



గత కొన్నేళ్లలో మలయాళ దర్శకులు బాగా డెవలప్ అయ్యారు. క్రైమ్, హారర్, సస్పెన్స్ ఈ మూడు అంశాలను తీసుకుని వాటికి పోలీస్ ఆఫీసర్ల బ్యాక్ డ్రాప్ జోడించి చాలా సినిమాలు తీశారు. వాటిలో అత్యధిక శాతం హిట్టయినవే. మనోళ్లు కూడా ఓటిటిలో డబ్బింగ్ రూపంలో చూసి ఆహా ఓహో అన్నవాళ్ళే. ఈ సిరీస్ లో ఒక కొత్త మూవీ వచ్చింది. దాని పేరు సంభవం అధ్యాయం ఒన్ను. నేరుగా హాట్ స్టార్ లో రిలీజైన ఈ మూవీకి సోషల్ మీడియాలో చాలా సపోర్ట్ దక్కుతోంది. ఎందుకో చూద్దాం. అసలీ స్టోరీ పాయింటే క్రేజీగా ఉంటుంది. కేరళ ఆంధ్ర సరిహద్దులో ఉండే ఒక అటవీ ప్రాంతానికి ట్రాన్స్ ఫర్ మీద వెళ్తాడు ఆనంద్. దారిలో ఒక యాక్సిడెంట్ కనిపించి గాయపడిన మరో పోలీసును ఆసుపత్రిలో చేరుస్తాడు. డ్యూటీ చేరే సమయంలో అడవిలో జరిగిన ఒక దాడి గురించి తెలిసి మరో ఇద్దరు ఆఫీసర్లతో కలిసి అక్కడికి చేరుకుంటాడు. కానీ లోపలికి వెళ్లే కొద్దీ ముప్పై సంవత్సరాల వెనుకటి సంఘటనలు, మనుషులు ఎదురవుతారు. అసలు ట్విస్టులు మొదలవుతాయి. కథని ఇక్కడ చిన్నగా చెప్పినప్పటికీ అసలు కంటెంట్ లో బోలెడు ట్విస్టులు పెట్టారు. టైం లూప్ కాన్సెప్ట్ కొత్తది కాకపోయినా దాన్ని ఒక అడవికి ముడిపెట్టి, కాకి తలతో ఉన్న మనిషి విగ్రహానికి హారర్ ఎలిమెంట్ జోడించి దర్శకుడు జీతూ సతీషన్ మంగళతు కొత్త అనుభూతి కలిగిస్తాడు. ముఖ్యంగా మొదటి అరగంట కాస్త ఓపిగ్గా చూడగలిగితే ఆ తర్వాత స్క్రీన్ ప్లే పరుగులు పెడుతుంది. ముఖ్యంగా సెకండాఫ్ లో వచ్చే మలుపులను ఈజీగా గెస్ చేయలేనంత టిపికల్ గా ఉంటాయి. తెలుగు ఆడియోతో పాటు అందుబాటులో ఉన్న సంభవం అధ్యాయం ఒన్ను ఈ జానర్ సినీ ప్రియులను ఖచ్చితంగా ఆకట్టుకుంటుంది. కాకపోతే మల్లువుడ్ స్టయిల్ స్లో నెరేషన్ ఇందులోనూ ఉంటుంది. ఆ తరహా కథనం అలవాటు లేకపోతే కొంచెం ల్యాగ్ అనిపిస్తుంది. ఇది మొదటి భాగమే. పార్ట్ 2కి ముఖ్యమైన లీడ్ ఇచ్చి ఆసక్తి పెంచారు. సినిమా చూశాక కలిగే సందేహం ఒకటే. ఇంత క్రేజీ ఐడియాలు మలయాళీ మేకర్స్ కి ఎలా వస్తాయో. ఇలాంటివి థియేటర్ కన్నా డిజిటల్ లోనే బాగా ఆడతాయి.

# ప్రతాప్ కష్టాలు పగవాడికి కూడా వద్దు



రేపు విడుదల కాబోతున్న పాపం ప్రతాప్ కు టైటిల్ కు తగ్గట్టే చివరి నిమిషం వరకు అయ్యో పాపం అనిపించే పరిణామాలే జరుగుతున్నాయి. చివరి నిమిషంలో సెన్సార్ చిక్కు ఒకటి వచ్చి పడటంతో నిర్మాతలు ఆఘమేఘాల మీద పరుగులు పెడుతున్నారు. సినిమాలో ఎలాంటి జంతువులను వాడలేదని అనిమల్ వెల్ఫేర్ బోర్డు నుంచి ఒక సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. కానీ ఎక్కడో పొరపాటు జరగడంతో దాన్ని మర్చిపోయారు. అది సబ్మిట్ చేస్తే తప్ప సెన్సార్ క్లియరెన్స్ రాదు. కథకు సంబంధించిన ఒక ముఖ్యమైన ట్విస్టు జంతువు మీదే ఉంటుందట. నిన్న సోషల్ మీడియాలో ఈ లీకు తెగ చక్కర్లు కొట్టింది. పగలు మనిషిగా రాత్రి మృగంగా మారిపోయే జంతువు పాయింట్ అంటూ తెగ ఊదరగొట్టారు. ఇది పాపం ప్రతాప్ అనే క్లారిటీ వచ్చేసినట్టే. ఈ లెక్కన హైదరాబాద్ లో ప్లాన్ చేసిన నైట్ ప్రీమియర్లు దాదాపుగా లేనట్టే. ఒకవేళ ఆ టైంకి సమస్య పరిష్కారం కాకపోతే రేపు ఉదయం షోలు లేట్ కావొచ్చు. దీనికొకటే కాదు గతంలో దండోరా కూడా ఇలాంటి ప్రాబ్లమ్ ఫేస్ చేసింది. అప్పుడు ప్రొడ్యూసర్లు పడిన టెన్షన్ అంతా ఇంతా కాదు. ఎట్టకేలకు సెన్సార్ తెచ్చుకుని సమయానికి షోలు వేయగలిగారు. కానీ అప్పుడు వచ్చిన ఇష్యూ జంతువులది కాదు. కొన్ని సన్నివేశాల పట్ల అభ్యంతరం వచ్చింది. అది అంతర్గతంగా సెట్ చేసుకునేది కాబట్టి టైంకి సాల్వ్ అయ్యింది. కానీ పాపం ప్రతాప్ ఇప్పుడు బయటి నుంచి నో యానిమల్ పత్రం తీసుకురావాలి. ఏది ఏమైనా ఇకపై నిర్మాతలు ఇలాంటి విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కనీసం వారం ముందే ఇలాంటి ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యేలా చూసుకోవాలి. లేకపోతే డిస్ట్రిబ్యూటర్ల నుంచి ఎగ్జిబిటర్ల దాకా అందరూ ఇబ్బంది పడతారు. తిమ్మరాజుపల్లి టీవీ, బ్యాడ్ బాయ్ కార్తీక్, పల్లిచట్టంబితో పోటీ పడుతున్న పాపం ప్రతాప్ కు అన్నీ సానుభూతులే దక్కుతున్నాయి. ఇదంతా ఎలా ఉన్నా కనీసం థియేటర్లలో సూపర్ అయితే తిరువీర్ కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది.

# పెద్ది... డేట్ ఎందుకు చెప్పలేదు?




అనుకున్నదే అయింది. 'పెద్ది' సినిమా వాయిదా పడింది. ఈ విషయాన్ని ఈ రోజు అధికారికంగా ప్రకటించేశారు. ఐతే మార్చి నెలాఖరు నుంచి వాయిదా వేసినపుడు ఏప్రిల్ 30న రిలీజ్ అంటూ కొత్త డేట్ స్పష్టంగా చెప్పిన చిత్ర బృందం.. ఈసారి మాత్రం ఆ పని చేయలేదు. ఇప్పటికే రెండుసార్లు డేట్ మార్చుకున్న నేపథ్యంలో ఇంకోసారి డేట్ చెప్పి.. అటు ఇటు అయితే జనాల్లో పూర్తిగా క్రెడిబిలిటీ కోల్పోతామన్న భయం కావచ్చు.

జూన్ నెలలో ఇంకో భారీ పాన్ ఇండియా సినిమా అయిన 'టాక్సిక్' రావాల్సి ఉంది. ఆ సినిమా విడుదల తేదీని అనుసరించే 'పెద్ది'కి డేట్ ఫిక్స్ చేయాలని అనుకుంటున్నారు. టాక్సిక్‌ను మార్చి 19 నుంచి వాయిదా వేసినపుడు.. కొత్త రిలీజ్ డేట్ జూన్ 4గా ప్రకటించారు. కానీ ఆ డేట్‌కు పక్కాగా సినిమా వస్తుందా అనే విషయంలో సందేహాలున్నాయి. 'టాక్సిక్' చిత్రాన్ని ప్రొడ్యూస్ చేసిన కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థే.. విజయ్ చిత్రం 'జననాయగన్'ను కూడా నిర్మించింది. ఆ సినిమా అనివార్య కారణాలతో వాయిదా పడ్డ సంగతి తెలిసిందే. దాని రిలీజ్ విషయంలో చాలా చిక్కుముడులు ఉన్నాయి. వాటన్నింటినీ పరిష్కరించుకుని ఏ తేదీన రిలీజ్ చేస్తారు అన్నదాన్ని బట్టే 'టాక్సిక్' విడుదల కూడా ఆధారపడి ఉంది. కాబట్టి ఈ రెండు చిత్రాల వ్యవహారం ఒక కొలిక్కి వస్తేనే.. 'పెద్ది'ని ఎప్పుడు రిలీజ్ చేయాలన్నది నిర్ణయం అవుతుంది. అందుకే ప్రస్తుతానికి జూన్ రిలీజ్ అని మాత్రమే చెప్పారు. ఈసారి డేట్ చెబితే పక్కాగా ఆ తేదీకి రావాల్సిందే కాబట్టి.. ఎందుకైనా మంచిదని ఆచితూచి వ్యవహరిస్తోంది చిత్ర బృందం. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తోంది. శివరాజ్ కుమార్, జగపతిబాబు ముఖ్య పాత్రలు పోషించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, రత్నవేలు ఛాయాగ్రహణం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీస్ సంస్థతో కలిసి వృద్ధి సినిమాస్,

## మూవీ మసాలా.. ఎంటర్‌టైన్మెంట్ న్యూస్



# మృణాల్‌తో సినిమా చేస్తే హీరో ఔటేనా?



సినిమాల్లో పాత్రలను కొంతమంది నిజ జీవితంలో కూడా ఎంతో ఓన్ చేసుకుంటారు. తెరపై వారికి అన్యాయం జరిగితే నిజంగానే వారికేదో నష్టం జరిగినంత ఫీలవుతారు. అలాంటి ప్రభావం చూపగలిగే పాత్రలు చాలా గొప్పవి. బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ తెలుగులో అలాంటి పాత్రే చేసింది 'సీతారామం' చిత్రంలో. రామ్ కోసం ఆ సినిమాలో సీత పడే తపనకు ప్రేక్షకులు ఎంతగానో కదిలిపోయారు. రామ్‌ను కోల్పోయిన సీతను చూసి చివర్లో హృదయం ద్రవించి పోతుంది. తన వల్లే ఆ సినిమాలో సీతకు రామ్ దూరమయ్యాడని ఆ చిత్రంలో విష్ణు శర్మ పాత్రను పోషించిన సుమంత్.. మృణాల్‌కు సారీ చెప్పిన సంగతి తెలిసిందే. ఐతే మృణాల్.. ఇలా తన సినిమాల్లో భర్తను కోల్పోయే పాత్ర చేయడం 'సీతారామం'కే పరిమితం కాదు. అంతకుముందు హిందీ 'జెర్సీ'లోనూ ( హిందీ ) అలాంటి క్యారెక్టరే చేసింది. ఇప్పుడు మృణాల్ నుంచి వచ్చిన 'డెకాయిట్'లోనూ చివరికి తన లవర్‌ను కోల్పోతుంది. ఇలా కెరీర్లో ఎక్కువగా భర్త లేదా లవర్‌ను కోల్పోయే పాత్రలు చేస్తున్న నేపథ్యంలో.. తన ఫ్రెండు ఒకరు తనకు 'హజ్బెండ్ మర్డరర్' అనే పేరు పెట్టినట్లు ఒక ఇంటర్వ్యూలో వెల్లడించింది మృణాల్ ఠాకూర్. ఇలాంటి పాత్రలు ఎక్కువ అయిపోతున్న నేపథ్యంలో ఇకపై కొంచెం జాగ్రత్త పడాలేమో అన్నట్లు ఆమె వ్యాఖ్యానించింది. మరోవైపు 'సన్నాఫ్ సర్దార్-2' చిత్రంలో తనకు భర్తగా పెద్ద వయస్కుడైన చుంకీ పాండేను పెట్టడం తనకు నచ్చలేదని వ్యాఖ్యానించింది మృణాల్. ఈ సినిమాలో కొన్ని ముఖ్యమైన ఎమోషనల్ సీన్లు ఎడిటింగ్‌లో లేపేయడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సినిమా సరిగా ఆడకపోవడానికి ఇవే కారణాలన్నట్లు ఆమె మాట్లాడింది. తనకు ప్రేమించేంత ఖాళీ లేదని.. ఇప్పుడే పెళ్లి కూడా చేసుకోబోనని ఆమె ఈ ఇంటర్వ్యూలో స్పష్టం చేసింది ఈ మరాఠీ అమ్మాయి.



## బిజినెస్ న్యూస్



# లాభాల్లో ప్రారంభమై నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. యుద్ధం త్వరలో ముగియొచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలతో ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. ముఖ్యంగా బ్యాంక్, ఆటోషేర్లలో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. అమెరికా-ఇరాన్ చర్చల పురోగతిపై ఉన్న అనిశ్చితి కూడా ప్రభావం చూపింది. సెనట?స్క్ ఇంట్రాడే గరిష్ఠాల నుంచి వెయ్యి పాయింట్ల మేర పతనమైంది. సెన్సెక్స్ ఉదయం 78,677.56 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,111.24) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,730.32 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత యూటర్న్ తీసుకున్న సూచీ.. 77,674.93 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 122.56 పాయింట్ల నష్టంతో 77,988.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 34.55 పాయింట్ల నష్టంతో 24,196.75 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ట్రెంట్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఇన్ఫోసిస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 96.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4808 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ధరలు పెంచిన HUL.. లిరిల్, డవ్, పియర్స్ సబ్బులు ప్రియం



ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సబ్బుల ధరలను పెంచేసింది. ముడి సరకు ధరలు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో ధరల పెంపు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా లిరిల్, పియర్స్, డవ్ వంటి సబ్బుల ధరలు 100 గ్రాములకు రూ.2-3 చొప్పున పెరిగాయి. అంటే సుమారు 3-5 శాతం పెరుగుదల కనిపించింది. తాజా ధరల సవరణతో లిరిల్ 100 గ్రాముల బార్ రూ.41కు చేరింది. పియర్స్ రూ.42, డవ్ సీరమ్ సోప్ రూ.60, డవ్ పింక్ సోప్ రూ.70కి పెంచింది. సబ్బులతో పాటు సర్ఫ్, రెడ్ లేబుల్ వంటి ఇతర ఉత్పత్తులూ ఈ జాబితాలో ఉన్నాయి. గతేడాది జీఎస్టీ రేట్ల సవరణతో ఉత్పత్తుల ధరలు తగ్గించిన హెచ్‌యూఎల్.. ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరలను పెంచేసింది. ముఖ్యంగా సబ్బుల తయారీలో కీలక ముడి పదార్థమైన పామ్ ఫ్యాటీ యాసిడ్ డిస్టిలేట్ (గ్రాఖీూణ) ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో హెచ్‌యూఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. సరఫరా కొరత, పామాయిల్ ధరల్లో ఒడుదొడుకుల కారణంగా ఇటీవల కాలంలో పీఎఫ్ఏడీ ధరలు విపరీతంగా పెరిగాయి. అదే సమయంలో పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు రసాయన ముడి పదార్థాల ధరలు పెరిగాయి. దీనికితోడు సప్లయ్ చైన్ అంతరాయాలు, రవాణా ఖర్చులు, ఇంధన ఖర్చులు కూడా పెరిగాయని హెచ్‌యూఎల్ పేర్కొంది. కమొడిటీ ధరలు, క్రూడ్, పామాయిల్, ప్లాస్టిక్ ధరల పెరుగుదలతో ఎంపిక చేసిన ఉత్పత్తుల ధరలు పెంచామని, వినియోగదారులపై అధిక భారం పడకండా జాగ్రత్తలు తీసుకున్నట్లు హెచ్‌యూఎల్ ప్రతినిధి పేర్కొన్నారు.

# 19% ప్రీమియంతో విప్రో రూ.15 వేల కోట్ల బైబ్యాక్



: ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. రూ.15 వేల కోట్లతో షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. ఒక్కో షేరును రూ.250 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. గురువారం నాటి స్టాక్ క్లోజింగ్ ధరతో (రూ.210) పోలిస్తే ఇది 19 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం 60 కోట్ల షేర్లను కొనుగోలు చేయనున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. కంపెనీ పెయిడ్ అప్ షేర్ క్యాపిటల్‌లో 5.7 శాతానికి ఇది సమానమని, రూ.15 వేల కోట్లు మించకుండా బైబ్యాక్ చేపట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది. టెండర్ రూట్‌లో ఈ బైబ్యాక్ చేపట్టనున్నట్లు విప్రో తెలిపింది. రికార్డు తేదీ నాటికి విప్రో షేర్లు కలిగిన వాటాదారులు ఈ బైబ్యాక్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తామని పేర్కొంది. ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూపు సభ్యులు ప్రతిపాదిత బైబ్యాక్‌లో పాల్గొనేందుకు సంకేతాలు ఇచ్చారని తెలిపింది. రికార్డు తేదీ వివరాలను త్వరలో వెల్లడిస్తామంది. 2019లో రూ.10,500 కోట్లు, 2020 నవంబరులో రూ.9,500 కోట్లు, 2023లో రూ.12వేల కోట్లతో విప్రో బైబ్యాక్ చేపట్టింది. తాజా బైబ్యాక్ విప్రో చరిత్రలో భారీ బైబ్యాక్‌గా నిలవనుంది. మరోవైపు విప్రో తన త్రైమాసిక ఫలితాలను కూడా గురువారం ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 2 శాతం క్షీణించి రూ.3502 కోట్లకు పరిమితమైంది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలపాల ద్వారా వచ్చే ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.24,236 కోట్లుగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికంతో పోల్చినప్పుడు విప్రో లాభంలో 12 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం.

# బిందీ-తిలకం' అది పాత సర్క్యులర్.. స్పందించిన సీఈఓ



తన సిబ్బంది మతపరమైన గుర్తులు ధరించవద్దని ప్రముఖ కళ్లజోళ్ల విక్రయ సంస్థ లెన్స్‌కార్ట్ ఆదేశించిందంటూ ఒక సర్క్యులర్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. అది తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వివాదంపై సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పీయూశ్ బన్సల్ (్రావఎబంష్ట్ర దీ్ఘఅఝుశ్రీ) స్పష్టత ఇచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? లెన్స్‌కార్ట్ సిబ్బంది స్టైల్ గైడ్ అంటూ నెట్టింట్లో కొన్ని పాయింట్లు వైరల్ అయ్యాయి. వాటి ప్రకారం.. తన స్టోర్లలో సిబ్బంది నలుపు రంగు హెడ్‌స్కార్ఫ్, నలుపు తలపాగాలు ధరించడానికి అనుమతి ఉంది. తిలకం, బిందీ పెట్టుకోవడానికి మాత్రం అనుమతి లేదు. ఈ పాయింట్లు నెట్టింట్లో చక్కర్లు కొట్టడంతో తీవ్ర విమర్శలు వ్యక్త మయ్యాయి. మతపరమైన పక్షపాతం చూపిస్తున్నారంటూ కొందరు నెటిజన్లు పోస్టులు పెట్టారు. ఈ వ్యవహారంపై బన్సల్ ఎక్స్ వేదికగా స్పష్టత ఇచ్చారు. "లెన్స్‌కార్ట్‌కు సంబంధించి ఒక అసత్యప్రచారం జరుగుతోంది. బిందీ, తిలకం సహా ఎలాంటి మతపరమైన వ్యక్తీకరణలపైన కూడా మా సంస్థలో ఆంక్షలు లేవు. మేం ఎప్పటికప్పుడు మా మార్గదర్శకాలను సమీక్షిస్తూనే ఉంటాం. పాత విధానాలు ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించవు. ఈ గందరగోళం పట్ల క్షమాపణలు కోరుతున్నాం" అని ఒక ప్రకటన విడుదల చేశారు.

# డిప్యూటీ చైర్మన్ ఎన్నికను బహిష్కరిస్తున్నాం - కాంగ్రెస్



న్యూఢిల్లీ : రాజ్యసభలో ఏప్రిల్ 17న నిర్వహించనున్న డిప్యూటీ చైర్మన్ ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఎన్ డి ఎ అభ్యర్థి హరివంశ్ ను అగౌరవపరచడం లేదని, కేంద్రం వైఖరికి నిరసనగా ఈచర్య తీసుకున్నామని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ గురువారం పేర్కొన్నారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవికి రాష్ట్ర పతి నామినేట్ చేసిన వ్యక్తిని గతంలో ఎన్నడూ పరిగణనలోకి తీసుకోలేదని, పార్ల మెంటులో –అనూహ్య పరిణామం' నెలకొందని అన్నారు. గత ఏడేళ్లుగా మోడీ ప్రభుత్వం లోక్ సభ డిప్యూటీ స్పీకర్ ను నియమించలేదని, ఇంతటి జాప్యం ఇంతకు ముందెన్నడూ జరగలేదని అన్నారు. పార్లమెంటు పనితీరుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డిప్యూటీ చైర్మన్ డిప్యూటీ స్పీకర్ ప్రతిరూపంగా వ్యవహరిస్తారని అన్నారు. డిప్యూటీ చైర్మన్ గా హరివంశ్ పదవీకాలం ఏప్రిల్ 9న ముగిసిందని, మరుసటి రోజే రాష్ట్రపతి ఆయనను రాజ్యసభకు నామినేట్ చేశారని అన్నారు. డిప్యూటీ చైర్మన్ పదవికి హరివంశ్ ను ఎన్ డిఎ మూడవసారి బరిలోకి దింపిందని, ఈ పదవికి రాష్ట్రపతి నామినేట్ చేసిన సభ్యుడిని పరిగణనలోకి తీసుకోవడం ఇదే మొదటిసారని జైరాం రమేష్ ఉద్ఘాటించారు. ఈచర్య పార్లమెంటరీ సాంప్రదా యాలపై ప్రశ్నలను లేవనెత్తు తోందని అన్నారు. ప్రతిపక్షాలతో ఎటువంటి అర్థవంతమైన సంప్రదింపులు జరపకుండానే కేంద్రం ఏక పక్షంగా ముందుకు సాగుతోందని మండి పడ్డారు. ఇటువంటి నియామకాలలో కీలకమైన ఏకాభిప్రాయ ప్రక్రియను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మూడు కారణాలతో శుక్రవారం నిర్వహించే డిప్యూటీ చైర్మన్ ఎన్నికలను బహిష్కరించాలని తీవ్ర విచారంతో కాంగ్రెస్ నిర్ణయం తీసుకుందని అన్నారు.

# రిజర్వేషన్లతో.. లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు



న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి గానీ, పురుషులకు గానీ ఎలాంటి నష్టం జరగదని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల (ఔశీఎవఅ =వంవతీఙఅశీఅం)కు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజక వర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం 3 కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అనంతరం వీటిపై చర్చ ప్రారంభించగా.. కేంద్రమంత్రి మేఘ్‌వాల్ ప్రసంగించారు. ఈ బిల్లులతో లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని అన్నారు.

"పార్లమెంట్ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. మహిళా రిజర్వేషన్లను అమలుచేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలను తీసుకునేందుకు పార్లమెంట్‌కు రాజ్యాంగం శక్తినిచ్చింది. ఈ క్రమంలోనే మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాం. లోక్‌సభ స్థానాలను 50శాతానికి పెంచేందుకు వీటిని తీసుకొచ్చాం. ఈ బిల్లులతో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. లోక్‌సభ స్థానాలు 815కు పెరగడంతో మహిళలకు 272 సీట్లు లభిస్తాయి. దీనివల్ల ఎవరికీ నష్టం ఉండదు. ఈ మహిళల కోటాలో ఎస్సీ, ఎస్టీలకు ఉపకోటా కూడా లభిస్తుంది" అని కేంద్ర మంత్రి వివరించారు.

**డీలిమిటేషన్‌తో రిజర్వేషన్లకు ముడిపెట్టొద్దు: గౌరవ్ గొగోయ్**

అనంతరం ఈ బిల్లులను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడారు. "మహిళల రిజర్వేషన్లకు సంబంధించి మూడేళ్ల క్రితం ఇవే చర్చలు జరిగాయి. వాటినే కేంద్రం మళ్లీ చెబుతోంది. 2023 కంటే ముందు ఐదుసార్లు మహిళలకు సంబంధించిన చట్టాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ మహిళల రిజర్వేషన్లకు అను కూలంగా ఉంది. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన నాటినుంచే వాటిని అమలుచేయాలి. మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ స్థానాల పెంపునకు ముడిపెట్టవద్దు. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేస్తామని గతంలో హోం మంత్రి చెప్పారు.

# యుపిపై మండిపడిన అలహాబాద్ హైకోర్టు



న్యూఢిల్లీ : యుపిలో మతమార్పిడుల నిరోధక చట్టం దుర్వినియోగంపై అలహాబాద్ హైకోర్టు యోగి ప్రభుత్వంపై మండిపడింది. యుపి చట్టవిరుద్ధ మత మార్పిడుల నిరోధక చట్టం,2021 కింద –తప్పుడు, బూటకపు, నిరాధారమైన' ఎఫ్ఐఆర్ లను నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసులు, థర్డ్ పార్టీ ఫిర్యాదు దారులు ఈ చట్టాన్ని –ఆందోళనకరమైన రీతిలో దుర్వినియోగం' చేస్తున్న తీరును తాము గమనించామని జస్టిస్ అబ్దుల్ మొయిన్, జస్టిస్ ప్రమోద్ కుమార్ శ్రీవాస్తవ లతో కూడిన డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది. మతమార్పిడి నిరోధక చట్టంలోని నిబంధనల కింద ఒక ముస్లిం వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఆ ఎఫ్ఐఆర్ ను సవాలు చేస్తూ ఆతను దాఖలు చేసిన పిటిషన్ పై ఈ నెల 13న ధర్మాసనం విచారణ చేపట్టింది. 18ఏళ్ల యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బహ్రాయిచ్ పోలీసులు ముస్లిం వ్యక్తిపై బిఎన్ఎస్, 2023లోని సెక్షన్లు 87,69, 351(3),యుపి చట్టవిరుద్ధ మత మార్పిడి నిరోధక చట్టం, 2021లోని సెక్షన్లు 3, 5(1)కింద కేసు నమోదు చేశారు. అయితే బిఎన్ఎస్ సెక్షన్ 183 కింద పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో ఆ మహిళ ఎఫ్ఐఆర్ లో ఆరోపణలను ఖండించింది. తాను ముస్లిం వ్యక్తితో గత మూడేళ్లుగా పరస్పర అంగీకారంతో సహ జీవనం చేస్తున్నానని ఆమె పేర్కొంది. మతం మారమని గాని, పెళ్లి చేసుకోవాలని గాని తనపై ఎటువంటి ఒత్తిడి చేయలేదని తెలిపింది. అతనితో కలిసి జీవించాలని కోరుకుంటు న్నానని, అయితే కొందరు తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. మెజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చినప్పటికీ, దర్యాప్తు అధికారి అత్యాచారం ఆరోపణను ఉపసంహరించి, కిడ్నాప్ , దాడి, మతమార్పిడి నిరోధక చట్టంలోని నిబంధనల కింద దర్యాప్తును కొనసాగించారని గుర్తించినట్లు కోర్టు తెలిపింది. ఈ చర్యను –విపరీతమైన మార్పు'గా అభివర్ణిస్తూ, బాధితురాలి వాంగ్మూలం దృష్ట్యా తదుపరి దర్యాప్తు అనవసరమని కోర్టు పేర్కొంది. దర్యాప్తు అధికారి బాహ్య ఒత్తిడికి తలొగ్గి వ్యవహరిస్తున్నారని తెలిపింది. ఈ చట్టం కింద థర్డ్ పార్టీ ఫిర్యాదులు పెరుగుతున్న ధోరణిని గుర్తించినట్లు ధర్మాసనం తెలిపింది. ఇది ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టంచేసిన ఆందోళనలను ప్రతిబింబిస్తోందని పేర్కొంది. ఇటువంటి సందర్భాల్లో తీసుకున్న చర్యలపై నివేదికను సమర్పించాల్సిందిగా హోంశాఖ అదనపు కార్యదర్శిని ఆదేశించింది. తప్పుడు ఫిర్యాదు చేసినందుకు తనపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని మహిళ తండ్రికి నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ అరెస్ట్ పై స్టే విధించడంతో పాటు, బాధితులకు భద్రత కల్పించాలని ఆదేశించింది.

# నేను తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే సింగర్ మంగ్లీ



హైదరాబాద్ : తాను ఎలాంటి తప్పు చేయలేదని, చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనని సింగర్ మంగ్లీ తెలిపారు. రూ.10 కోట్ల మైక్రో ఫైనాన్స్ వివాదంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని బుధవారం డీజీపీ ఆఫీసులో లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్‌కు మంగ్లీ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ .... సింగర్‌గా తనకు పాటలు తప్ప ఎలాంటి స్కాములు తెలియవని చెప్పారు. తన ప్రమేయం లేని ఆర్థిక వివాదం కారణంగా మానసికంగా నలిగిపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో తాను బాధితుల పక్షానే ఉంటానని మంగ్లీ హామీ ఇచ్చారు. తన పేరును అనవసరంగా వాడి అప్రతిష్ఠకు పాల్పడ్డ మధునాయక్, హిమాకాంత్‌రెడ్డి, రమావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీ ఆఫీసులో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎవరినీ మోసం చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. నిజం తెలుసుకోకుండా దోషిగా చిత్రీకరించడం బాధాకరమని పేరొన్నారు. ఈ కేసులో బాధితుల తరపున మాట్లాడుతున్న అడ్వొకేట్ సుబ్బారావు కేవలం పబ్లిసిటీ కోసమే తన పేరును వాడుకుంటున్నారని చెప్పారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై, ముఖ్యంగా అడ్వొకేట్ సుబ్బారావుపై చట్టపరంగా ముందుకు వెళతానని, అవసరమైతే పరువు నష్టం నోటీసులు ఇస్తానని మంగ్లీ హెచ్చరించారు. నేరగాళ్లే బాధితుల రూపంలో వస్తున్నారని మంగ్లీ తరపు న్యాయవాది చెప్పారు.

# 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' పైనే నా తొలి సంతకం : స్టాలిన్



చెన్నై : ఏప్రిల్ 23న తమిళనాడు పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అక్కడ డిఎంకె, ఎన్‌డిఎ కూటముల మధ్య ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. బుధవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, డిఎంకె చీఫ్ ఎం.కె స్టాలిన్ సేలంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన డిఎంకె ప్రభుత్వం చేపట్టిన మహిళా సంక్షేమ పథకాల గురించి చెప్పారు. 'నేను సంతకం చేసిన మొదటి ఫైల్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించినది. ప్రతి మహిళా ప్రయోజనాలను పొందాలని నేను కోరుకుంటున్నాను. మహిళలకు ప్రయోజనం చేకూర్చే మొత్తం ఎంతైనా సరే.. నేను మహిళల సంక్షేమం కోసం అది చేస్తాను' అని అన్నారు. మహిళా సిధికారత, వారి సామాజిక– ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచే పథకాల అమలుపై డిఎంకె ప్రభుత్వం దృష్టి సారించిందని స్టాలిన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాగా, ఈ ఎన్నికల ప్రచారంలో డిఎంకెతోపాటు కమల్‌హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం), కూటమిలో భాగస్వామ్య పార్టీ అయిన దేశీయ ముర్పోక్కు ద్రావిడ కజగం పార్టీల నేతలు కూడా పాల్గొన్నారు.

# యుద్ధానికి త్వరలో ముగింపు

**అందుకు చేరువగా ఉన్నాం**
**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు**
**రెండో విడత చర్చలకు మధ్యవర్తుల ప్రయత్నాలు**
**టెహ్రాన్‌లో మునీర్ బృందం**

కైరో, వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం త్వరలోనే ముగుస్తుందని.. అందుకు అత్యంత చేరువగా ఉన్నామని పేర్కొన్నారు. తమతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందనీ చెప్పారు. ఇక అమెరికా–ఇరాన్ మధ్య రెండో విడత చర్చల ఏర్పాటుకు మధ్యవర్తుల ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా తమ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ నేతృత్వంలో ఓ బృందాన్ని టెహ్రాన్‌కు పాకిస్థాన్ బుధవారం పంపించింది. మరోవైపు– ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా కొనసా గిస్తోంది. దీంతో ఆగ్రహించిన టెహ్రాన్.. దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రాంతీయంగా వాణిజ్య కార్యకలా పాలను అడ్డుకుంటామని తాజాగా హెచ్చరించింది. పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రం, ఎర్రసముద్రం వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు సాగనివ్వబోమని పేర్కొంది.

ఇరాన్ అణ్వస్త్రాలను తయారుచేసుకునేది: ట్రంప్

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే.. ఇరాన్‌తో యుద్ధం దాదాపు ముగిసినట్లే కనిపిస్తోందని ట్రంప్ బుధవారం ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో వ్యాఖ్యానించారు. అయితే పూర్తిస్థాయి పరిష్కార మార్గం కోసం చర్చలు ఇంకా జరగాలన్నారు. తాము ఇప్పుడు నిలువరించి ఉండకపోతే.. ఇరాన్ అణ్వస్త్రాలను తయారు చేసుకొని ఉండేదని ఆయన పేర్కొన్నారు.

# అమెరికా మరో షాక్.. ఇరాన్ చమురుపై మళ్లీ ఆంక్షలు



పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకు పోయింది. ఈ క్రమంలో ఇరాన్ చమురుపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ.. అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. టెహ్రాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ బుధవారం (అమెరికా కాలమాన ప్రకారం) ఆంక్షలను ప్రకటించారు. ఇరాన్, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా సడలించిన సంగతి తెలిసిందే. ఈ సడలింపును పొడిగించేది లేదని తాజాగా బెసెంట్ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే ఇరాన్ చమురు ఎగుమతులతో సంబంధాలు ఉన్న అనేకమంది వ్యక్తులు, చమురు సంస్థలు, నౌకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రెజరీ శాఖకు చెందిన విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం ప్రకటించింది. ఆంక్షలకు గురైన సంస్థలు.. ఇరాన్ మాజీ సుప్రీం నేత అయతుల్లా అలీఖమేనీ రాజకీయ సలహాదారుడి కుమారుడు మహమ్మద్ హుస్సేన్ షమ్‌ఖానీ నేతృత్వంలోనివని తెలిపింది. ఫిబ్రవరిలో అమెరికా– ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అలీ ఖమేనీ సలహాదారుడు ప్రాణాలు కోల్పోయారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకల రాకపోకలను అమెరికా దిగ్బంధిస్తోన్న సంగతి తెలిసిందే. ఇది ఇరాన్‌పై ఆర్థికంగా తీవ్ర ఒత్తిడి కలిగించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ దేశ చమురుపై మరిన్ని ఆంక్షలు విధించడం గమనార్హం. ఇక, ఇరాన్ ఆర్థిక లావాదేవీలకు చైనా బ్యాంకులు సహకరించినట్లు తెలిస్తే.. వాటిపై ఆంక్షలు విధించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బెసెంట్ హెచ్చరించారు.

**పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేసిన ఇరాన్**

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అన్ని పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఇరాన్‌కు చెందిన జాతీయ పెట్రోకెమికల్ కంపెనీ పేర్కొంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు, శత్రు దాడుల వల్ల కలిగిన నష్టాల నేపథ్యంలో దేశీయ పరిశ్రమలకు, వినియోగదారులకు ప్రాధా న్యం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఎగుమతి అయి.. ఇంకా విదేశాలకు చేరని సరకును కూడా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా కంపెనీలకు సూచించింది.

# మొదటి త్రైమాసికంలో 5శాతానికి చేరిన ఆర్థిక వృద్ధి రేటు : చైనా



బీజింగ్ : అంచనాలను మించి వార్షికంగా మొదటి త్రైమాసికంలో చైనా ఆర్థిక వృద్ధి రేటు 5శాతానికి చేరింది. పశ్చిమాసియా సంఘర్షణతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్నప్పటికీ.. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో చైనా ఆర్థిక వృద్ధి రేటు అంచనాలను మించి 5శాతానికి చేరినట్లు గురువారం విడుదలైన ఆర్థిక గణాంకాలు వెల్లడించాయి. జాతీయ గణాంకాల బ్యూరో (ఎన్ బి ఎస్ ) వెల్లడించిన డేటా ప్రకారం.. చైనాలో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) జనవరి– మార్చి త్రైమాసికంలో గతేడాదితో పోలిస్తే 5.0శాతం వృద్ధి చెందింది. ఆర్థికనిపుణుల సర్వే ఆధారంగా ఎ ఎఫ్ సి అంచనా వేసిన 4.8శాతం కంటే ఈ సూచిక కొంత ఎక్కువగా ఉంది.చైనా ఈ ఏడాది 4.5–5.0శాతం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది దశాబ్దాల్లోనే అత్యల్పం. ఎన్ బి ఎస్ డేటా ప్రకారం.. మార్చి నెలలో రిటైల్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 1.7శాతం పెరిగాయి.

ఇది బ్లూమ్ బెర్గ్ అంచనా వేసిన 2.4శాతాన్ని అందు కోలేక పోయింది.పారిశ్రామిక ఉత్పాదకత 5.7 శాతానికి పెరిగిందని ఎన్ బిఎస్ తెలిపింది. ఇదిద బ్లూమ్ బెర్గ్ అంచనా 5.3 శాతాన్ని అధిగమించినప్పటికీ, జనవరి, ఫిబ్రవరి నెలల్లో కలిపి నమోదైన 6.3శాతం వృద్ధి రేటు కంటే తక్కువ.ఇరాన్ పై అమెరికా,ఇజ్రాయిల్ దాడులతో ప్రపంచ వ్యాప్తంగా ఐదవ వంతు ఇంధనం, గ్యాస్ రవాణా అయ్యే హార్ముజ్ జలసంధి నుండి నౌకాయానానికి ఆటంకం కలగడంతో అంతర్జాతీయంగా ఇంధన ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో ఈ డేటా వెలువడటం గమనార్హం.

# ఇరాన్ రూ.9 లక్షల కోట్లు ఎక్కడున్నాయి..?



అమెరికా–ఇరాన్ మధ్య రెండో దఫా చర్చలు జరగొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి యుద్ధం ముగించాలంటే తమ పది షరతులు అంగీకరించాల్సిందేనని ఇప్పటికే ఇరాన్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా స్తంభింపచేసిన ఆస్తులను విడుదల చేయడం వాటిలో ఒకటి. రెండోసారి జరిగే చర్చల్లో ఆ ఆస్తులను విడుదల చేయాలని టెహ్రాన్ గట్టిగా పట్టుబట్టొచ్చని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అసలు వాటిని ఫ్రీజ్ చేయడం ఎక్కడమొదలైంది..? ఆ మొత్తం ఎంత ఉండొచ్చన్న ప్రశ్నలు ఆసక్తిగా మారాయి.

అమెరికా పౌరులను బందీలుగా తీసుకొని..కొన్ని దశాబ్దాలుగా అమెరికా, దాని మిత్రదేశాలు విధించిన ఆంక్షలతో ఇరాన్ (×ఞఅ) ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటూ వస్తోంది. 1979లో తొలిసారి ఆ ఆంక్షల పర్వం మొదలైంది. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం సమయంలో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. అప్పుడు 50 మందికి పైగా అమెరికా ఎంబసీ సిబ్బంది, పౌరులను ఇరాన్ రెవల్యూషనరీ నాయకులు బందీలుగా చేసుకున్నారు. 444 రోజుల పాటు వారిని బందీలుగా ఉంచుకున్నారు. ఈ చర్యపై తీవ్రంగా మండిపడిన నాటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీకార్టర్.. ఆస్తులను ఫ్రీజ్ చేసి, బందీల విడుదల కోసం ఒత్తిడి తీసుకు వచ్చారు. అనంతరకాలంలో అణు కార్యక్రమాలు, బాలిస్టిక్ క్షిపణి ప్రోగ్రామ్‌లతో ఈ ఆంక్షల తీవ్రత పెరుగుతూ వచ్చింది. దాంతో చమురు, ఇతర ఉత్పత్తుల ఎగుమతులపై వచ్చిన ఆదాయాన్ని వినియోగించుకోలేకపోయింది. ఇప్పటికీ అదే పరిస్థితి. ఆర్థిక వ్యవస్థ కుదేలై.. అక్కడి ప్రజల రోజూవారీ జీవితం అస్తవ్యస్తమవుతోంది. కొన్ని నెలల క్రితం ఇరాన్‌లో పెద్దఎత్తున ఎగిసిపడిన నిరసనలకు ఆర్థిక అస్థిరత ప్రధానకారణమైన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ సంస్థ లేక ఒక దేశంలోని అధికారిక సంస్థ.. ఒక వ్యక్తి, కంపెనీ, తమ దేశంలో కార్యకలాపాలు నిర్వహించే మరో దేశానికి చెందిన ఆస్తులను తాత్కాలికంగా తమ స్వాధీనంలోకి తీసుకుంటారు. దానినే ఆస్తులను ఫ్రీజ్ చేయడం అంటారు. ఈ ఆస్తులను ఒక కోర్టు, మరోదేశం, అంతర్జాతీయ సంస్థ, ఒక బ్యాంకింగ్ వ్యవస్థ ఫ్రీజ్ చేయొచ్చు. మనీలాండరింగ్, నేర కార్యకలాపాలు, ఆస్తుల నుంచి ప్రయోజనం పొందకుండా ఫ్రీజ్ చేసి అడ్డుకుంటారు.

# 28వ వార్డులో పార్కు అభివృద్ధికి స్థలాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్





**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** 28వ వార్డు ఫేకర్ లే అవుట్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్కు అభివృద్ధికి అంచనాలు, ప్రణాళికలను సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తూర్పు జోన్ 28వ వార్డు పరిధిలోని ఫేకర్ లే అవుట్ కు అనుకొని ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి పరి చేయుటకు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి వి వి సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫేకర్ లేఅవుట్ లో దాదాపు 800 కుటుంబాలు నివసిస్తున్నాయని, వారికి ఆహ్లాద కరమైన మంచి వాతావరణం కొరకు , పిల్లల ఆటలకు పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి పరిచి వాకింగ్ ట్రాక్ తో పాటు వాటర్ ఫౌంటెన్, చిల్డ్రన్ ఎక్విప్మెంట్, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులతో పాటు ఫ్లోరా (ఫేకర్ లేఅవుట్ రెసిడెంట్ అసోసియేషన్) రెసిడెంట్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ రాజు, స్వచ్ఛభారత్ అంబాసిడర్ బాలమోహన్ దాస్, జీవీఎంసీ కమిషనర్ కు తెలిపారు. కమిషనర్ స్పందిస్తూ ఫేకర్స్ లేఅవుట్ పక్కన ఉన్న ఖాళీ స్థలము విస్తీర్ణము, కోర్టు కేసులు మొదలైనవి ఏమైనా ఉన్నాయా అని డీసీపీ హరిదాసును అడిగి తెలుసుకొని ఆ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.ఆ ఖాళీ స్థలం లో ఎత్తు పల్లాలు అధికంగా ఉన్నందున పార్కులు గా అభివృద్ధి చేసేందుకు ప్రణా ళికాయుతంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని, అవసరమగు అంచనాలు తో పాటు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పీవీవి సత్యనారాయణ రాజు ను ఆదేశించారు. పార్కు అభివృద్ధికి ఫ్లోరా అసోసియేషన్ వారు సామాజిక సహకారంతో పార్కు అభివృద్ధికి భాగస్వామ్యం కావాలని కమిషనర్ వారికి సూచించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ గంగాధర్, ఫేకర్ లేఅవుట్ రెసిడెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

# నగర నిత్య పరిశుభ్రతే ధ్యేయంగా పారిశుద్ధ్య విధులు నిర్వహించాలి

## – జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** నగర నిత్య పరిశుభ్రతే ధ్యేయంగా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించేలా జీవీఎంసీ ప్రజా ఆరోగ్య అధికారులు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తూర్పు జోన్ 21వ వార్డు పరిధిలోని పాత సిబిఐ డౌన్ పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను తూర్పు జోన్ జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులే




కీలకమని, నిత్యశీ నగర పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులు నిర్ణీత సమయానికే విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని అందుకు జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు బాధ్యతగా పారిశుధ్య కార్మికులచే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు హాజరు తప్పనిసరిగా చూడాలని, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లపై పారిశుద్ధ్య కార్మికులకు పూర్తి అవగాహన కలిగి ఉండేలా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. నివాసితులు బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేస్తే వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. వార్డులో, రోడ్డు మార్గంలోను, బహిరంగ ప్రదేశాలలో భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తే వెంటనే ఆ వ్యర్థాలను వార్డ్ సచివాలయం ప్లానింగ్ కార్యదర్శులు ద్వారా తరలించే ప్రక్రియ చేపట్టాలని , భవన నిర్మాణం వ్యర్థాలు వేసే యజమానుల నుండి అపరాధ రుసుములు వసూలు చేయాలని ఆదేశించారు. నిత్యం నిర్ణీత సమయానికే క్లాప వాహనాలు విధులకు వచ్చి చెత్త సేకరణ చేస్తున్నాయని స్థానికులను ఆరా తీశారు. తదుపరి ఆ మార్గంలో వస్తున్న క్లాప్ వాహనాన్ని ఆపి క్లాప్ వాహనంపై ప్రజల అవగాహన కొరకు ఏర్పాటు చేసిన విజిల్స్ సిస్టం, మైక్ అనౌన్స్మెంట్ ఎందుకు వినియోగించలేదని డ్రైవర్ పై,లోడర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇకపై ప్రజల అవగాహన కొరకు డోర్ టు డోర్ వ్యర్థాలు సేకరణకు వెళ్ళినప్పుడు మైకు సిస్టం తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ సహాయ వైద్యాధికారి బి. ప్రసాద్ రావు, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవిందరావు, వార్డు సచివాలయం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సెన్సెస్ 2027 స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చాలా సులభం

## - స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్న

## జీవీఎంసీ కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** భారతదేశ జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు ప్రభుత్వం సూచించిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమంలో పాల్గొనబోతున్న ప్రజలు స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చాలా సులభంగా చేసుకోవచ్చునని జీవీఎంసీ కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం ఆయన తన నివాసంలో స్వయంగా తన మొబైల్ ఫోన్లో https://se.census.gov.in వెబ్సైట్ ద్వారా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకుని తన పేరుతో సహా సంబంధిత అంశాలను పొందుపరిచి అందరికీ స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ సెన్సస్ 2027 లో భాగంగా ప్రభుత్వం సూచించిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమం ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు జరుగుతుందని, మొట్టమొదటిసారిగా సెన్సెస్ 20 27 కార్యక్రమం లో డిజిటల్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, సెల్ఫ్ ఎన్యుమరేషన్ అతి సులభంగా https://se. census. gov.in వెబ్సైట్ లో పౌరులందరూ నమోదు చేసుకోవచ్చు నన్నారు. ఈరోజు తను సెల్ఫ్ ఎన్యుమరేషన్ అతి సులభంగా చేసుకున్నానని తన ఫోటోను ప్రదర్శిస్తూ అందరికీ స్ఫూర్తిని కలిగించారు. కావున ప్రజలందరూ భారతదేశ జనగణన 2027 కార్యక్రమంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కు సంబంధిత అంశాలను https://se.census.gov.in వెబ్సైట్ ద్వారా అతి సులభంగా ఉన్న అంశాలకు సమాధానాలను పొందుపరిచి సెల్ఫ్ ఎన్యుమరేషన్ లో నమోదు చేసుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కల్పించినందున ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ఎన్యూమరేటర్, జీవీఎంసీ సహాయక ఇంజనీర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్




**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, ఏప్రిల్ 16 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాలను సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17, 18వ తేదీల్లో విశాఖపట్టణంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పర్యటన ఉన్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం సమీక్షించారు. అధికారులందరూ సమన్వయం చేసుకోవాలని, ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా, అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. 17వ తేదీ రాత్రికి ఆయన విశాఖ పట్టణం చేరుకొని, 18వ తేదీ ఉదయం నుంచి విశాఖ పట్టణంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొం టారని ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పర్యటనలో భాగంగా ఎండాడ పరిధి రుషికొండ ఇస్కాన్ టెంపుల్ వెనుక భాగంలో నిర్మించతలపెట్టిన జ్యూడీషియల్ గెస్ట్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన ఆయన చేతుల మీదుగా జరుగుతుందని, దీని నిర్వహణలో జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ప్రోటోకాల్, భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ మేనేజ్మెంట్, వసతి ఇతర ఏర్పాట్లలో లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఫస్ట్ ఏడీజే ఎం. వెంకట రమణ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# STEP-UP కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎక్స్పోజర్ విజిట్

## - ప్రాక్టికల్ అవగాహనకు జీవీఎంసీ ప్రత్యేక కార్యక్రమం

### – జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్





**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విజ్ఞాన అభివృద్ధి, అవగాహన కొరకు ప్రతిష్టాత్మకంగా మొట్టమొదటిసారిగా STEP-UP అనే స్టూడెంట్స్ ఎక్స్పోజర్ విజిట్ కార్యక్రమం జీవీఎంసీ ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, యు సి డి- డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.నాగార్జునరావు లతో కలిసి నగరంలో పలు బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లూవీ బాక్సీ కంటైనర్ టెర్మినల్ ప్రాంతాలకు విద్యార్థులను తీసుకువెళ్లి ఎక్స్పోజర్ విజిట్ నిర్వహించడం జరిగినదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా K.N.M గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మహారాణి పేట బ్రాంచ్ ,జీవీఎంసీ ఈస్ట్ జోన్ కార్యాలయం, PM బాక్సీ కంటైనర్ టెర్మినల్లను సందర్శించేందుకు తీసుకెళ్లడం జరిగినది. 8వ తరగతి విద్యార్థినలను SBI సిరిపురం బ్రాంచ్ , జీవీఎంసీ ఈస్ట్ జోన్ కార్యాలయానికి తీసుకెళ్లి, అక్కడ బ్యాంకింగ్ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది, అలాగే జీవీఎంసీలో వివిధ సర్టిఫికెట్లు ఎలా జారీ చేస్తారు అనే విషయాలను సంబంధిత అధికారులు వారికి వివరించడం జరిగినదన్నారు. ఈ సందర్భంగా SBI సిరిపురం బ్రాంచ్లో జీవీఎంసీ కమిషనర్ విద్యార్థినులతో మాట్లాడుతూ ఈ ఎక్స్పోజర్ విజిట్లో వారు ఏమి నేర్చుకున్నారో అడిగి తెలుసుకొని, పాఠశాల విద్యార్థులు విజ్ఞానం పెంపొందించేందుకుగాను అవగాహన నిమిత్తమై బ్యాంకులలో, ప్రభుత్వ కార్యాలయాలలో ,పరిశ్రమలలో పలు విషయాలను తెలుసుకునేందుకుగాను ఈ ఎక్స్పోజర్ విజిట్ విద్యార్థినీ విద్యార్థుల కొరకు నిర్వహించడ మైనదని కమిషనర్ విద్యార్థులకు తెలిపారు.ఈ బృందానికి జీవీఎంసీ అదనపు కమిషనర్ పిఎమ్. సత్యవేణి నేతృత్వం వహించి విద్యార్థినులకు అవగాహన కల్పించారన్నారు. అలాగే 9వ తరగతి విద్యార్థులను SBI మహారాణిపేట బ్రాంచ్ మరియు PM బాక్సి కంటైనర్ టెర్మినల్ను సందర్శించేందుకు తీసుకువెళ్లి డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్నాగార్జున రావు నేతృత్వం వహించి అవగాహన కల్పిం చారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవడం తమకు ఎంతో విలువైన అనుభవంగా భావిస్తూ, తమ భవిష్యత్తుకు ఇది బలమైన పునాది వేస్తుందని ఆనందం వ్యక్తం చేశారన్నారు ఇలాంటి గొప్ప అవకాశాన్ని కల్పించిన జీవీఎంసీ కమిషనర్ కు సంబంధిత అధికారులకు సిబ్బందికి ఖ.చీ.వీ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. 135 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు స్టూడెంట్స్ ఎక్స్పోజర్ విజిట్లో పాల్గొనడం జరిగినది.

## సమాన అవకాశాల దిశగా కీలక అడుగు...

# డిలిమిటేషన్ బిల్లుకు కూటమి ప్రభుత్వం స్వాగతం

### - జనాభా ప్రాతిపదిక కాదు... ప్రతి రాష్ట్రానికి 50% లోక్‌సభ స్థానాల పెంపు

### - టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (నేటి మనదేశమ్) :** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన డిలిమిటేషన్ బిల్లు దేశ వ్యాప్తంగా సమతుల్య ప్రతినిధిత్వానికి దారితీసే చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ బిల్లు దక్షిణ రాష్ట్రాలకు నష్టం కలిగిస్తుందన్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... జనాభా ప్రాతిపదికగా కాకుండా ప్రతి రాష్ట్రానికి సమానంగా సుమారు 50 శాతం లోక్‌సభ స్థానాల పెంపు జరగనుంది. దీంతో దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న అనుమానాలకు తావులేదు. కొందరు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు అపోహలు మాత్రమే అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఉదాహరణగా తీసు కుంటే, ప్రస్తుతం ఉన్న సుమారు 25 లోక్‌సభ స్థానాలు భవిష్యత్తులో దాదాపు రెండింతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించే విధానమని వివరించారు. డిలిమిటేషన్ ప్రక్రియపై అనవసర భయాందోళనలు సృష్టించడం సరికాదని, బిల్లులోని నిబంధనలను పరిశీలిస్తే ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతిపదికన స్థానాల పెంపు స్పష్టంగా కనిపిస్తుందని పల్లా గారు తెలిపారు. దేశవ్యాప్తంగా సమాన ప్రతినిధిత్వాన్ని బలోపేతం చేసే ఈ బిల్లును తీసుకువచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి కృషిని పల్లా గారు ప్రశంసించారు. అలాగే దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య బలోపేతానికి అవసరమైన సంస్కరణలను ధైర్యంగా అమలు చేస్తున్న నాయకత్వంగా మోదీ గారు నిలుస్తున్నారని కొనియాడారు. అదేవిధంగా, సమతుల్య అభివృద్ధి--సమాన అవకాశాల సాధనకు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, జాతీయ దృక్పథం ఈ సందర్భంలో మరింత స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతూ, దేశ ప్రయోజనాలతో సమన్వయం చేసే నాయకత్వం చంద్రబాబు గారిదేనని పల్లా గారు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లుతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ప్రవేశపెట్టడం ద్వారా మహిళల సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉందని, ఈ నిర్ణయాలు దేశ రాజకీయ వ్యవస్థలో నూతన మార్పులకు నాంది పలుకుతాయని తెలిపారు. దేశంలో సమాన ప్రతినిధిత్వం, ప్రజాస్వామ్య పటిష్టతకు దోహదపడే ఈ బిల్లులను అన్ని వర్గాల ప్రజలు స్వాగతించాలని పల్లా శ్రీనివాసరావు గారు కోరారు.

Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com